ఇబ్బంది పెడుతున్నారు!



మాకు ప్రభుత్వం సెంటు భూమి కూడా ఇవ్వలేదు. కదిరినేనిపల్లి రెవెన్యూలో సర్వే నెం.1లో 2ఎకరాల భూమిని చదును చేసుకొని ఇటీవల జామాయిల్ మొక్కలు నాటుకున్నాను. మా పక్క గ్రామాల నేతలు కొందరు వచ్చి ఆ మొక్కలను పెరికేశారు. సర్వే నెం.1లో మొత్తం 803.86 ఎకరా లు మేతపోరంబోకు భూమి ఉన్నందున ఆ మొత్తాన్ని ఇద్దరు ముగ్గురు కలిసి ఆక్రమించు కునేందుకు నన్ను ఇబ్బంది పెడుతున్నారు.

- నూతలపాటి శ్రీనయ్య, కదిరినేనిపల్లి

మా భూమిని ఆక్రమించారు!



నాతోపాటు మా బంధువులకు అల్లంపాడు రెవెన్యూలోని సర్వే నెం.511లో ఒక్కొక్కరికి ఒక ఎకరా చొప్పున 2003లో ఇచ్చారు. ఇప్పుడా భూమిని వేరే వారు ఆక్రమించుకున్నారు. మాకు అప్పగించమని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ఆక్రమణదారులంతా రాజకీయన నాయకులే కావడంతో మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు.

- సయ్యద్ బీసాబీ, మర్రిపాడు

రాజకీయ నేతల అండ... అధికారుల ఉదాసీనత వైఖరి ఇంకేం ఈ రెండూ అక్రమార్కులకు కలిసి వచ్చాయి. అత్యధికంగా ప్రభుత్వ భూములు ఉన్న మర్రిపాడుపై కబ్జారాయుళ్ల కళ్లు పడ్డాయి. రాత్రిపూట, సెలవు దినాల్లో సదరు భూములను చదును చేయించి జామాయిల్, పొగాకు, మినుము వంటి పంటలు సాగు చేసుకుంటూ తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు.

అడ్డగోలుగా..!



- మర్రిపాడులో పేట్రేగిపోతున్న ఆక్రమణదారులు
- రాత్రికి రాత్రే ప్రభుత్వ భూముల చదును
- పట్టీపట్టనట్లు రెవెన్యూ యంత్రాంగం
- కబ్జాకోరులకు రాజకీయ అండ

మర్రిపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 21 రెవెన్యూ గ్రామాలలో 22,432.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో 15,123 ఎకరాలను ఆరు విడతలుగా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. మిగిలిన 7309.19 ఎకరాలు మాత్రం అధికారుల లెక్కల ప్రకారం ప్రభుత్వ భూమిగా ఉంది. మండలం మీదుగా నాలుగు ప్రధాన జాతీయ రహదారులు వెళ్తుండటం, జిల్లా కేంద్రానికి దూరంగా ఉండటంతో ఈ ప్రాంతంపై ఆక్రమణదారుల కళ్లుపడ్డాయి. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో గుర్తించి హస్తగతం చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఎకరా హైవేకు సమీపాన అయితే రూ.8లక్షలు ఉండగా, కొంచెం దూరంగా ఉన్న భూమి అయితే రూ.2 లక్షల వరకు పలుకుతోంది. రోజు రోజుకు భూముల ధర పెరిగిపోతుండటంతో కొందరు రాత్రికిరాత్రే ప్రభుత్వ భూముల్లో కంప చెట్లు తొలగించి ముమ్మరంగా చదును చేస్తున్నారు. అనాదీనం, వాగు పోరంబోకు మేత పోరంబోకు అనే తేడా లేకుండా ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఒక్కొక్కరు పది నుంచి ఇరవై ఎకరాల వరకు ఆక్రమించేసి తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. ఎప్పటికైనా తమ కుటుంబ సభ్యులకే చెందుతాయనే ఆలోచనతో సదరు భూముల్లో ఏదో ఒక పంటను సాగు చేస్తున్నారు. అధికారులు మారిన ప్రతిసారి తమ భూమిని ఆక్రమించారంటూ ఒకరిమీద ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, గ్రీవెన్స్‌డేలలో అర్జీలు ఇస్తున్నారు. అంతేగాక పోలీస్ స్టేషన్ల వరకూ ఫిర్యాదులు చేసుకుంటున్నారు. వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తున్న అధికారులు ప్రభుత్వ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేసినా అక్రమార్కులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. బోర్డులను సైతం పడేసి తమ పని పూర్తి చేస్తున్నారు. ఇర్లపాడు రెవెన్యూలో ఒకే వ్యక్తి సుమారు 70ఎకరాల పైనే ఆక్రమించుకున్నాడు. ఆ భూమిలో బోరు వేయించి వ్యవసాయానికి అనుకూలంగా విద్యుత్ కనెక్షన్ కూడా తీయించుకున్నాడు. అలాగే కడప జిల్లా బద్వేలు సమీపంలో ఇటీవల సెంచురీ ప్లైవుడ్ పరిశ్రమ ఏర్పడటంతో అక్కడ జామాయిల్ ధరలు కూడా క్వింటం రూ.5వేలు పలుకుతోంది. ఆ పరిశ్రమ ద్వారా ఉచితంగా జామాయిల్ మొక్కలు సరఫరా చేస్తుండటంతో భూ ఆక్రమణదారులకు ఖర్చు కూడా కలిసి వస్తోంది. గతంలో ప్రభుత్వం ద్వారా భూమిని పొంది కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక లేదా అప్పుడే తమ భూములకు హద్దులు చూపక ఆ పొలంలోకి వారు వెళ్లలేదు. తీరా సర్వే చేయించుకున్నాక ఆ పొలం ఆక్రమణకు గురైందని తెలిసి ఆక్రమణదారుడిని భూమి నుంచి బయటకు పంపలేని పరిస్థితుల్లో బాధితులు కుమిలిపోతున్నారు. మొన్నటివరకు సుమారు 2వేల ఎకరాలు ఆక్రమణకు గురై వుండగా, ఇటీవల అనంతరం చాబోలు 100, బ్రాహ్మణపల్లి 100, పెగళ్లపాడు 100, కదిరినేనిపల్లి 150, ఇర్లపాడు 150, అల్లంపాడు 100, పల్లవోలు 100 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. పొంగూరు, చుంచులూరు, ఇర్లపాడు రెవెన్యూలలో పాత భూ తగాదాలే కొనసాగుతున్నాయి. ఇటు అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడం అటు రాజకీయ నాయకుల అండ ఉండటంతో కబ్జారాయుళ్లు పేట్రేగిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పరాధీనం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



అల్లంపాడులోని ప్రభుత్వ భూమిలో పొగాకు సాగు చేస్తున్న అక్రమార్కులు

ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తే
ఎవరినీ ఉపేక్షించం!

- అక్రమ రవాణా నిరోధానికి నిఘా ముమ్మరం
- టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్



అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న శ్రీనివాస్

రాపూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక నిఘా విభాగం (టాస్క్‌ఫోర్స్) ఎస్పీ పి.శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం పెంచలకోనలో ఉన్న సీబీఈటీ ఫారెస్ట్ కమ్యూనిటీ పార్కులో రాపూరు రేంజ్ పరిధిలోని అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ఎర్రచందనం చెట్ల నరకడం, లోడింగ్, రవాణా జరిగే ప్రాంతాల వివరాలు సేకరించి, అక్కడ నిఘాను ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు. అలాగే, స్మగ్లింగ్ వెనక స్థానికంగా ఎవరున్నా, రాజకీయ నేతలు ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఎర్రచందన కూలీలు, పాత నేరస్థులపైనా ఓ కన్నేసి ఉంటామని చెప్పారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు బాలిరెడ్డి, వి.శ్రీనివాసులురెడ్డి, ఏపీఎఫ్ జె.శ్రీనివాస్, ఎఫ్ఆర్ఓ ఎం.మురళీకృష్ణ, ఆర్ఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, కె.కృపానంద్, ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్, రాపూరు రేంజ్ ఆఫీసర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

నెల్లూరు నగరంలో యువకుడి హత్య

మరో యువకుడి పరిస్థితి విషమం

- వివరాలు 7లో..

జిల్లా ఓటర్లు 19,44,664



నెల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొత్తం ఓటర్లుగా 19,44,664 మంది నమోదయ్యారు. అందులో పురుష ఓటర్లు 9,50,600, మహిళా ఓటర్లు 9,93,283 మంది ఉన్నారు. థర్డ్ జండర్లు 210, సర్వీసు ఓటర్లు 571 మందిగా రికార్డయ్యారు. ఈ మేరకు జిల్లాలోని ఓటర్ల ముసాయిదా తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. రాష్ట్రంలో విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం జిల్లాల తర్వాత అత్యధిక ఓటర్లు ఉన్న జిల్లాగా నెల్లూరు నిలిచింది. ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌ను గతేడాది నవంబరు, డిసెంబరు నెలలో ఎన్నికల సంఘం చేపట్టింది. కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు అవకావం కల్పించింది. ఆ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక తుది జాబితాను తాజాగా ప్రచురించింది.

పదవులు కాదు.. ప్రజాసేవే ముఖ్యం!




పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

- నా హయాంలో అభివృద్ధి చేశా!
- నెల్లూరులో మాజీ సీఎం నల్లారి
- కిరణ్‌ను కలిసి మంత్రి ఆనం
- గోదావరి, కృష్ణా జలాలు, సాగునీటి విషయాలపై చర్చ

6

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో



అనంతసాగరం జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం 2,194 క్యూసెక్కుల నీరు వస్తుండగా సోమవారం 2,781 క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.562 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,050, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

రికార్డులు సాధించడమే లక్ష్యం



రికార్డులు సాధించడమే లక్ష్యంగా క్యారమ్స్‌లో రాణిస్తున్నాను. వరసగా మూడుసార్లు రికార్డులు సాధించి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును కూడా సొంతం చేసుకున్నాను. 2014లో సబ్‌జూనియర్ విభాగంలో, 2015లో జూనియర్స్ విభాగంలో, 2016లో గిన్నిస్‌బుక్ రికార్డ్‌లో శాశ్వత పేరు నమోదు చేసుకున్నాను. ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 51 బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించడంతో 2017లో కాలిఫోర్నియాలోని బర్కిలీ యూనివర్సిటీ స్పోర్ట్స్‌లో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఏడు జాతీయ పోటీల్లో, మూడు సౌత్‌జోన్ పోటీల్లో సత్తా చాటిన నేను ప్రపంచ చాంపియన్‌గా నిలవడమే ధ్యేయంగా గెలిచేలా సాధన చేస్తున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారంతో ముందుకు సాగుతున్నాను.

- డాక్టర్ ఎస్‌కే హుస్నా సమీర, గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు విజేత

స్ట్రైకరొస్తే బోర్డు కొట్టేస్తా!

ఉత్కంఠగా ఆలిండియా క్యారమ్స్ పోటీలు



స్ట్రైకర్ చేతికొచ్చిన ప్రతిసారీ బోర్డుపై ఉన్న కాయిన్స్ అన్నీ వేసేయాలనే పట్టుదల... ఒక్కొక్క విజయంతో కప్పు గెలవాలనే తపన.. వెరసి నెల్లూరులో జరుగుతున్న ఆలిండియా క్యారమ్స్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. 25 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జాతీయ సంస్థల క్రీడాకారులు బరిలో నిలవడంతో ప్రతి ఆట రంజుగా జరుగుతోంది. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన వారు కూడా కారమ్స్ కదనరంగంలోకి దిగడంతో విజయం ఎవరిని వరిస్తుందనే ఉత్సుకత పెరుగుతోంది. సోమవారం నాటి పోటీల్లో పలు జట్లు గెలుపొంది క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. కాగా, ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు హాజరైన క్రీడాకారులు, ప్రతినిధులకు నిర్వాహకులు ప్రతి పూటా పసందైన విందు భోజనం ఏర్పాటు చేస్తున్నారు. సింహపురి ఆతిథ్యానికి వారంతా ఫిదా అవుతున్నారు.

6

రైల్వే శాఖ వారి
'ప్రీమియం' బాదుడు

- టికెట్ ధరపై 3 నుంచి 5 రెట్ల వసూలు
- డిమాండ్ ఉన్న రూట్లలో మరింత దోపిడీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పండుగలు, ఉత్సవాలు, తిరునాళ్ల ఇలా ముఖ్య రోజుల్లో ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో చార్జీలు పెంచడం ఇప్పటిదాకా మనం చూశాం. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని రెండింతల చార్జీలను పెంచి ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూలు చేశారు. దీని నుంచి గట్టెక్కేందుకు అత్యధిక శాతం మంది రైళ్లను ఎంచుకుంటారు. తామేం తక్కువ తిన్నామా!? అన్నధోరణిలో రైల్వే శాఖ కూడా చార్జీలను పెంచేసింది. ప్రీమియం తత్కాల్ పేరుతో గట్టుగా బాదేస్తోంది. సాధారణంగా చార్జీలు తక్కువగా ఉండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా రైలు ప్రయాణాన్నే కోరుకుంటారు. రైల్వే శాఖ కూడా గూడ్స్ రైళ్లను ఆదాయ వనరుగా చేసుకొని ప్రయాణికుల రైళ్లలో ధరలను అదుపులో ఉంచేది. అయితే కొంతకాలంగా రైల్వేశాఖ తీరులో మార్పువచ్చింది. పేదల కోసం ఎప్పటి నుంచో నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లను 'కరోనా' పేరుతో పూర్తిగా రద్దు చేసింది. ఇటీవల పునరుద్ధరిస్తామని అధికారులు ప్రకటించినా అమలు కాలేదు. మెమో రైళ్లలోనూ ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తున్నారు. ఇలా పేద, మధ్యతరగతి ప్రజలకు నష్టం కలిగించేలా రైల్వేశాఖ నిర్ణయాలు మారుతూ వస్తున్నాయి. ఇక రిజర్వేషన్ చేసుకొనే వారి నడ్డి విరిచేందుకు రైల్వేశాఖ తత్కాల్, ప్రీమియమ్ తత్కాల్ పేరుతో టికెట్ రేట్లను అమాంతం పెంచేస్తోంది. ఇదేమిటని రైల్వేశాఖ అధికారులను అడిగితే డిమాండ్ ఉన్నప్పుడు పెంచుకోవచ్చు కదా అని వారి నుంచి సమాధానం వస్తోంది.



భారీగా వసూలు

డిమాండ్ ఉన్న రోజులు, రూట్లలో బస్సు చార్జీలు పెరుగుతున్నట్లు రైల్వే శాఖ కూడా టికెట్ ధరలను పెంచేస్తోంది. స్లీపర్‌తోపాటు ప్రీమియమ్ తత్కాల్ పేరుతో 3టైర్ ఏసీ, 2 టైర్ ఏసీ, ఫస్ట్‌క్లాస్ ఏసీ చార్జీలను విమాన చార్జీలతో పోటీపడేలా వసూలు చేస్తోంది. నెల్లూరు నుంచి చిత్తూరు ప్రయాణించాలంటే త్రీటైర్ ఏసీ రూ.505 అయితే ముందుగా బుక్ చేసుకొనేందుకు రైల్వే అధికారిక వెబ్ సైట్ ఐఆర్‌సీటీసీలో వెయిట్‌యింగ్ లిస్టు చాంతాడంత ఉంటోంది. దాని పక్కనే అదే టికెట్ రూ.1760 ధర 83శాతం కన్ఫర్మ్ అయ్యే చాన్స్ అంటూ దర్శనమిస్తోంది. అదే 2టైర్ ఏసీకి టికెట్ ధర రూ.760 ఉంది. దాని పక్కనే అదే టికెట్ ధర రూ.3300గా ప్రీమియం తత్కాల్‌లో ఉంటుంది. ఇదే విధంగా అన్ని ప్రాంతాల రైళ్లలోనూ చార్జీలు పెంచేశారు.



కొనసాగుతున్న పోలీసు పరీక్షలు

నెల్లూరులోని పోలీసు పరేడ్ మైదానంలో జరుగుతున్న పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు సోమ వారం 338 మంది హాజరయ్యారు, 262 మంది గైర్హా జరయ్యారు. జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ ఈ పరీక్షలను పర్యవేక్షించారు. అభ్యర్థులు ఉద యం ఐదు గంట లకే మైదానానికి చేరుకొని పరీక్షల్లో పాల్గొన్నారు.

-నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

శిథిలమైన గత వైభవం!

కోవూరు పంచాయతీ కొత్తూరులో స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన గ్రామ పరిపాలనాధికారి కార్యాలయం నేడు శిథిలమైంది. పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలని భావించి అప్పట్లో నిర్మించిన ఈ భవనం గ్రామ పరిపాలనకు వెన్నుముకగా నిలచింది. గ్రామ పరిపాలన అనంతరం కాలక్రమంలో గ్రామ మునసబు కార్యాలయంగా, గ్రామచావిడిగా, రీడింగ్‌రూమ్‌గా ఎంతో సేవలందించిన ఈ భవనంపై స్థానికులకు మక్కువ ఎక్కువ. దీంతో భవనానికి పలు పర్యాయాలు సొంత నిధులతో మరమ్మతులు చేపట్టి గత కాలపు చిహ్నంగా కాపాడారు. భవనాన్ని సుందరంగా కన్పించే విధంగా రంగులు వేసి ఆనందపడేవారు. ఏ ప్రభుత్వ కార్యాలయానికి కేటాయించకుండా చారిత్రక కట్టడంగా అపురూపంగా చూసుకునేవారు. ప్రతి నిత్యం అక్కడచేరి కబుర్లు చెప్పుకునేవారు. స్థానికులు ఎంతో అమితంగా ప్రేమించే ఈ కట్టడం మూడేళ్ల కిందటి భారీ వర్షాలకు, వరదలకు దెబ్బతింది. పెంకులు కిందపడి శిథిలమైంది. అప్పటి ప్రభుత్వం పట్టించకోకపోవడంతో మొండిగోడలతో దర్శనమిస్తోంది.



- కోవూరు,(ఆంధ్రజ్యోతి)



కామాక్షితాయి హుండీ ఆదాయం రూ.33 లక్షలు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో సోమవారం హుండీల్లో నగదును లెక్కించారు. గతేడాది అక్టోబరు 29 నుంచి జనవరి 5వ తేదీ వరకు 68 రోజులకుగాను భక్తులు ప్రధాన హుండీల ద్వారా సమర్పించుకున్న కానుకల ద్వారా ఆలయానికి రూ.33,24,667 ఆదాయం చేకూరగా, అన్నదాన సదనం హుండీల ద్వారా రూ.2,30,057 ఆదాయం చేకూరిందని ఈవో ఏవీ.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అలాగే 67 గ్రాములు బంగారు వస్తువులు, 190 గ్రాముల వెండి వస్తువులు, యూఎస్ఏ డాలర్లు 41 ఉన్నట్లు తెలిపారు. హుండీల లెక్కింపులో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణచైతన్య, శ్రీధర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠ.. ఉద్వేగం!

- పోటాపోటీగా ఆలిండియా క్యారమ్స్
- క్వార్టర్స్‌లోకి ప్రవేశించిన క్రీడాకారులు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎవరికి ఎక్కువ కాయిన్స్ దక్కుతాయో... ఎవరు క్వీన్ (రెడ్ కాయిన్)ను చేజిక్కించుకుంటారో... ఎన్ని బోర్డుల్లో ఎవరు ఆటను ముగిస్తారో... ఇలా ఆలిండియా క్యారమ్స్ పోటీలు ఉత్కంఠగా... ఉద్వేగంగా జరుగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు ప్రత్యర్థి వ్యూహాలను గమనిస్తూనే టెక్నిక్‌కు వేగాన్ని మిళితం చేసి ఆటను త్వరగా ముగించేలా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఎన్నో పోటీల్లో ప్రతిభ చాటిన ర్యాంకింగ్ క్రీడాకారులు ప్రతి అవకాశాన్నీ పాయింట్లుగా మలుచుకుంటూ విజయానికి బాటలు వేసుకుంటున్నారు.

నెల్లూరు(విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు క్లబ్‌లో 29వ అఖిల భారత ఫెడరేషన్ కప్ క్యారమ్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ సహకారంతో ఏపీ క్యారమ్ సంఘం, నెల్లూరు క్యారమ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు దేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలు, భారతీయ సంస్థలకు చెందిన అగ్రశ్రేణి క్రీడాకారులతోపాటు మొత్తం 350 మంది ఆటగాళ్లు బరిలో నిలిచారు. తమ క్రీడానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ జిల్లా వాసులకు కనువిందు చేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రీ క్వార్టర్స్ డబుల్స్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీలను అంతర్జాతీయ క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్‌మేయర్(స్విట్జర్లాండ్), ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, ఎంపీ రాకీబుల్ హుస్సేన్, అంతర్జాతీయ క్యారమ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీడీ నారాయణ, అఖిల భారత క్యారమ్ సంఘం సీనియర్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి, ప్రధాన కార్యదర్శి భారతి నారాయణ్, కోశాధికారి ఎస్ మదన్‌రాజ్, రాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్‌జలీల్, ఫెడరేషన్ కప్ కో చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు క్లబ్ కార్యదర్శి, పోటీల నిర్వాహక కార్యదర్శి పొన్నవోలు సుధాకర్ రెడ్డి, జిల్లా క్యామర్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీమన్నారాయణ, కార్యదర్శి వీ రఘురామ్ శ్రీధర్, ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాసులు, క్లబ్ కోశాధికారి విశ్వనాథ్ పర్యవేక్షిస్తున్నారు.

పురుషుల విభాగంలో విజేతలు

ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఎండి ఆరిఫ్-అర్షదుల్లా ఖాన్ జట్టు కేరళకు చెందిన షన్వర్-అజ్మల్‌పై, మహారాష్ట్రకు చెందిన వికాస్ హరీష్-పంకజ్ పవార్‌లు, ఢిల్లీకి చెందిన సమూద్-జావెద్‌పై, అస్సాంకు చెందిన ప్రికర్‌సింగ్-ముజిబుల్ రెహ్మాన్‌లు సీఏజికి చెందిన రాజుబైసారే-ముఖేష్‌లపై గెలుపొందారు. జైన్ ఇరిగేషన్‌కు చెందిన సందీప్ డైవ్-అహ్మద్ ఫరూఖ్‌లు ఏపీకి చెందిన సురేష్‌రెడ్డి-అనంత్‌రెడ్డిలపై, ఆర్‌బీఐకు చెందిన జహీర్‌పాషా-ప్రకాష్‌మోర్‌లు పీఎస్‌పీబీకి చెందిన యోగేష్ పర్ధేశి-సందీప్ డెరోకర్‌పై, అస్సాంకు చెందిన జుగల్ కిషోర్ దత్తా-ధబజోతిలు కర్ణాటకకు చెందిన వినోద్-దివాకర్‌లపై విజయం సాధించారు. జైన్ ఇరిగేషన్‌కు చెందిన రహీం కరీం ఖాన్-అభిజిత్ త్రిపాంకర్‌లు తమిళనాడుకు చెందిన అబ్దుల్‌ఆసిఫ్-కుబేంద్రబాబుపై, పీఎస్‌పీబీకి చెందిన కె.శ్రీనివాస్-గుప్రాన్‌లు మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్ సోలంకి-ప్రపుల్‌కిషోర్‌లపై జయకేతనం ఎగురవేసి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించారు.

మహిళల విభాగంలో విజేతలు

పీఎస్‌పీబీకి చెందిన రష్మీకుమారి-ఇలవజఖీలు ఏఏఐకు చెందిన మంథాషా ఇక్బాల్-నిధిగుప్తాలపై, జైన్ ఇరిగేషన్‌కు చెందిన సమృద్ధి-శ్రుతిలు ఏపీకి చెందిన హారిక-హరిప్రియలపై, మహారాష్ట్రకు చెందిన కేసర్ రాజేష్ నిర్గన్-మధుర్ మహేష్ డెల్వీలు ఎల్‌ఐసీకి చెందిన అపూర్వ-అంజలిపై, తమిళనాడుకు చెందిన శోభిక-ప్రీతి ప్రిన్సెస్‌లు ఆర్‌బీఐకు చెందిన ఊర్మిళషిండే-పూర్ణిమ పరాటేలపై విజయం సాధించారు. పీఎస్‌పీబీలకు చెందిన కజామియా-మిత్రలు డీఏఎస్‌ఈబీకి చెందిన దేబోజనిభట్-వర్షబోరాలపై, ఏఏఐకు చెందిన షైనీ-బర్కత్‌నిషాలు బీహార్‌కు చెందిన ఖుష్బురాణి-సంధ్యాసిన్హాలపై, పీఎస్‌పీబీకు చెందిన కాజల్‌కుమారి-ఆకాంక్ష కదమ్‌లు, పశ్చిమబెంగాళ్‌కు చెందిన పాపియా బిస్వాల్-కాజల్‌సింగ్‌లపై, సీసీసీఎస్‌బీకి చెందిన నాగజ్యోతి-నీలంఘాట్కేలు ఆర్‌బీఐకు చెందిన కవితసోమంచి-అంబికపై గెలుపొంది క్వార్టర్స్‌కు వెళ్లారు.

జీవితంలో స్థిరపడ్డా..



క్యారమ్ క్రీడతోనే పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడ్డాను. గతంలో ఏపీ నుంచి క్రీడల్లో పాల్గొన్న నాకు నెల్లూరు జిల్లాలోని కావలి హెడ్‌పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం ఇచ్చారు. తండ్రి రాజేంద్ర దేశంలో మూడో ర్యాంక్‌లో ఉండడంతో ఆయన స్ఫూర్తితో నేను కూడా పలు విజయాలు సాధించాను.

- వినీత, ర్యాంకింగ్ క్రీడాకారిణి

ఆహా.. ఏమి రుచి!!

క్రీడాకారులకు పసందైన విందు

నెల్లూరు(విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అఖిలభారత ఫెడరేషన్ క్యారమ్ పోటీల్లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన విందు భోజనాలు అతిథులను, ఆహ్వానితులను, క్రీడాకారులను నోరూరిస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు నెల్లూరు ఆతిథ్యాన్ని స్వీకరిస్తూ ఆహా... ఏమిరుచి! అంటూ లొట్టలేస్తున్నారు. జిల్లా ఘనతను చాటేలా జరుగుతున్న ఈ పోటీల్లో సౌత్, నార్త్ వంటకాలను వడ్డిస్తూ అన్ని రాష్ట్రాల వారి జిహ్వాచాపల్యాన్ని తీరుస్తున్నారు. పెళ్లి తరహాలో భోజనం వండి, వడ్డించడం క్రీడా ప్రియులకు మంచి అనుభూతినిస్తోంది. వెజ్ బిర్యానీ, చోలే, ఆలూ పరోట, కచోరీతోపాటు సంప్రదాయ తెలుగు వంటకాలు, స్వీట్లు ఆటగాళ్లతో అదరహో!! అనిపిస్తున్నాయి. కర్ణాటక క్రీడాకారుల కోసం కాలాబాత్, కేరళ వారి కోసం ఇడియాపం, తమిళనాడు వారికి వడకర్రీ, దోశెలు, గుజరాతీలకు మిక్చర్స్ మహారాష్ట్ర వారికి రోటీ, బన్‌బటర్‌జామ్, చపాతీలు, రోటీలు, ఫ్రైడ్ రైస్, కరివేపాకు రైస్, ఎగ్స్, చికెన్, రాయలసీమ రాగిసంగటి, మసాలా వడల పులుసు, చికెన్... ఇలా అన్ని ప్రాంతాల వారి కోసం క్లబ్ నిర్వాహకులు ఎన్నో వెరైటీల వంటకాలను సిద్ధం చేసి ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. క్రీడాకారులు, అతిథులు కూడా ఘుమఘుమలాడే నెల్లూరు రుచులను ఆస్వాదిస్తూ ప్రశాంతమైన వాతావరణంలో పోటీల్లో పాల్గొంటున్నారు.



క్యారమ్స్‌తో ఉజ్వల భవిత

- జాతీయ, అంతర్జాతీయ క్రీడా ప్రముఖుల మనోగతం

క్యారమ్స్ క్రీడతో యువతకు ఉజ్వల భవిత ఉంటుందని, పట్టుదల, దీక్షతో సాధన చేస్తే విజయాలను అందుకోవచ్చని క్రీడా ప్రముఖులు తెలిపారు. లక్ష్యాలను అధిగమించడమేకాక ఉన్నత శిఖరాలు అధిరోహించడమే ధ్యేయంగా పోటీల్లో పాల్గొని రాణించేందుకు శ్రమిస్తున్నామని క్రీడాకారులు, ప్రతినిధులు తమ మనోగతాన్ని ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు..

భారత్‌లో విశేష ఆదరణ



భారతదేశంలో క్యారమ్స్ క్రీడకు విశేష ఆదరణ ఉంది. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఈ క్రీడ నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ వేగవంతంగా అభివృద్ధి చెందుతోంది. అధికశాతం మంది క్రీడాకారులు ర్యాంకింగ్ సాధించి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌ను కూడా భారత క్రీడాకారులు సాధిస్తుండడంతో యువత ఈ క్రీడపై ఆసక్తి చూపుతున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారి ఉన్నతికి పాటుపడుతున్నారు. ఏపీలో ముున్ముందు క్యారమ్‌కు ప్రత్యేక గుర్తింపు లభించనుంది. స్థానిక క్రీడాకారులు అన్ని విభాగాల్లోనూ సత్తా చాటుతున్నారు. ఈ క్రీడాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంతోపాటు క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ ఇస్తున్నాము.

- రకిబుల్ హుస్సేన్, పార్లమెంట్ సభ్యుడు, ఆలిండియా క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు

మహిళలూ సత్తా చాటుతున్నారు



మహిళలు వారి ప్రతిభా పాటవాలను నిరూపించుకునేందుకు క్యారమ్స్ ఒక చక్కని వేదికగా నిలుస్తోంది. వారికి ఫెడరేష న్ అన్ని విధాలుగా సహకారం అందిస్తుండడంతో సత్తా చాటుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత కీర్తిని ఇనుమడింప చేస్తున్నారు. ఇప్పటికే నాగజ్యోతి, ఖాజీమా ప్రపంచ చాంపియన్ సాధించి యువ క్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అలాగే ఉద్యోగావకాశాలు కూడా అధికంగా ఉండడంతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన మహిళలు ఈ క్రీడపై ఆసక్తి చూపుతూ పోటీలు ఎక్కడ జరిగినా హాజరవుతున్నారు. వారికి ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా మరింత ప్రోత్సహిస్తాము.

- భారతీ నారాయణ్, భారత ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి

ప్రపంచ దేశాల్లో గుర్తింపు



క్యారమ్స్ క్రీడకు ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. భారతలో పుట్టిన ఈక్రీడ నేడు 22 దేశాల్లో విస్తరించి పెద్ద ఎత్తున పోటీలు జరుగుతున్నాయి. ప్రపంచ ఫెడరేషన్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తూనే భారత్‌లో కూడా క్రీడాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నాము. గత కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున క్రీడాకారులు ఆసక్తి చూపడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాంపియన్‌షిప్ సాధిస్తుండటం శుభపరిణామం. ప్రపంచ స్థాయిలో కూడా భారత క్రీడాకారులే సత్తా చాటుతూ అన్ని దేశాలకు గట్టి పోటీ ఇస్తున్నారు.

- వీడీ నారాయణ్, అంతర్జాతీయ ఫెడరేషన్ కార్యదర్శి

ప్రపంచ ఛాంపియన్ కావడం గర్వంగా ఉంది



క్యారమ్ క్రీడలో ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌గా నిలవడం గర్వంగా ఉంది. చిన్నతనం నుంచి ఈ క్రీడపై ఉన్న మక్కువతో సాధన చేశాను. తండ్రి మహబూబ్ బాషా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూనే తనను ఎంతగానో ప్రోత్సహించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, క్రీడా ప్రేమికులు అందించిన సహకారంతో ప్రపంచ విజేతగా నిలిచాను. ప్రస్తుతం డిగ్రీ చదువుతూనే నిత్యం క్రీడలో సాధన చేస్తున్నాను. ఇప్పటి వరకు నేను ఆడిన ప్రతి మ్యాచ్‌లో గెలుస్తున్నాను. విశ్వ విజేతగా నిలవడంతో తమిళనాడు ప్రభుత్వం కోటి రూపాయల ప్రోత్సాహక బహుమతి అందించింది. ఇదే స్ఫూర్తితో మంచి ఉద్యోగం సాధించి ప్రపంచ క్యారమ్స్‌లో చిరస్థాయి స్థానం కోసం పోరాడుతున్నాను.

- ఖాజీమా, ప్రపంచ క్యారమ్ చాంపియన్

ముగిసిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలు

అన్నింటిలో గొలగమూడి క్రీడాకారుల విజయం

వెంకటాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. జోన్-3లో ఉన్న 8 గురుకుల బాలికల పాఠశాలల నుంచి 151 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన పరుగు పందెం, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, క్యారమ్స్, చెస్, షటిల్ తదితర క్రీడా పోటీల్లో విజేతలుగా గొలగమూడి గురుకుల బాలికల పాఠశాల క్రీడాకారులు నిలిచారు. అనంతరం విద్యార్థినులు చేసిన ప్రత్యేక విన్యాసాలు, నృత్యాలు ఎంతోగాను అకట్టుకున్నాయి. వెంకటాచలం సీఐ సుబ్బారావు విజేతలకు బహుమతులు, మెమెంటోలు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ రమణ ప్రసాద్, కృష్ణమూర్తి, సీహెచ్ ప్రసాద్, భాస్కర్, లక్ష్మీసునీత, పరమేశ్వర్‌రావు, ఎం.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ సుబ్బారావు, జిల్లా కన్వీనర్ రమణ ప్రసాద్

పదవులు కాదు... ప్రజాసేవే ముఖ్యం

- నా హయాంలో జిల్లాలో అభివృద్ధి పనులు
- మాజీ సీఎం నల్లారి

నెల్లూరు(క్రైం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని, ప్రజాసేవే ముఖ్యమని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నెల్లూరుకు వచ్చిన ఆయనకు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గౌరవ వందనం అందించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కిరణ్‌ను కలిశారు. గోదావరి, కృష్ణా జలాల పంపకం, సాగునీటి విషయాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. అనంతరం బీజేపీ జిల్లా కార్యాలయంలో నాయకులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. నాయకులు, కార్యకర్తలు కిరణ్‌ను సత్కరించారు. అనంతరం విలేక రులతో ఆయన మాట్లాడుతూ తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నెల్లూరు జిల్లాలో చేసిన అభివృద్ధి గురించి గుర్తుచేసుకున్నారు. నెల్లూరులో మెడికల్ కళాశాల ఏర్పాటు, ఆత్మకూరులో వంద పడకల ఆసుపత్రి, రెండు రెవెన్యూ డివిజన్లు, రెండు మున్సిపాలిటీల స్థాపన అప్పట్లో చేశామన్నారు. అండర్ డ్రైనేజీ కోసం రూ.100 కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణం, 20 వేల ఇళ్లు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు అప్పట్లో చేశామని గుర్తుచేసుకున్నారు. పదవులు పొందడం, కోల్పోవడం అనేది ముందుగానే రాసిపెట్టి ఉంటుందని, జీవితంలో ఏ పదవీ శాశ్వతం కాదని కేవలం మాజీ అనేది మాత్రమే శాశ్వతం అని చమత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, కందికట్ల రాజేశ్వరి, భరత్‌కుమార్‌రెడ్డి, వాకాటి ఆంజనేయరెడ్డి, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



నల్లారి కిరణ్‌ను సత్కరిస్తున్న మంత్రి ఆనం



వేణుగానలోలా.. శ్రీరంగనాథా..!

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి శ్రీదేవిభూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి వేణుగోపాలుడిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమం అధ్యయనోత్సవాల్లో భాగంగా జరిగింది. ఉదయం ధనుర్మాసం పూజల్లో భాగంగా ఆండాళ్ అమ్మవారికి అభిషేకాలు, విశేష అలంకారం, పూజలు జరిగాయి. అనంతరం తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా కొణిజేటి సత్యనారాయణగుప్తా, రంగయ్యగుప్తా వారసులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.



గీత గోవిందం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు సోమవారం ఏడోరోజుకి చేరాయి. స్వామి వారికి భగవద్గీత అలంకారం జరిగింది. ఈ సందర్భంగా ఆళ్వార్ల ఘోష్టి, దివ్యనాలాయిర ప్రబంధ ఘోష్టి గానం, శాత్తుముర్రై, విశేష అలంకారం జరిగింది. ఉదయం గోదాదేవికి ధనుర్మాసం పూజలు జరిగాయి. ఈ ఉత్సవాలకు దేవిశెట్టి వెంకటసుబ్బయ్య శ్రేష్ఠి కుటుంబం ఉభయకర్తకులు వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు, అర్చకులు పర్యవేక్షించారు.

సీనియర్ అసిస్టెంట్లుగా 11 మందికి ఉద్యోగోన్నతి

నెల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ శాఖలో పని చేస్తున్న 11 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయ భాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు ఎస్‌కే సైరాబాను, టీ శాంతిప్రియలను తెలుగుగంగ ప్రాజెక్టులో సీనియర్ అసిస్టెంట్లుగా బదిలీ చేశారు. కలెక్టరేట్‌లో ఉన్న సీహెచ్ నరసింహరావును జలదంకి ఆర్‌ఐగా, డీ శ్రీకాంత్‌ను మనుబోలు ఆర్‌ఐగా, కే ప్రదీప్‌కుమార్‌ను సైదాపురం ఆర్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు. సైదాపురంలో జూనియర్ అసిస్టెంట్ ఎస్‌కే సల్మాను సంగం ఆర్‌ఐగా, ఆత్మకూరులో పనిచేస్తున్న పీ మోహన్ రూపను కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. కోటలో పని చేస్తున్న వై.ప్రసాద్, గూడూరులో పనిచేస్తున్న వై వంశీకృష్ణ, తిరుపతి కలెక్టరేట్‌లో పని చేస్తున్న జీ దివాకర్‌లను తిరుపతి జిల్లాకు కేటాయించారు.

యువకుడి దారుణ హత్య

- మరో యువకుడి పరిస్థితి విషమం
- ముగ్గురిపై విచక్షణారహితంగా దాడి
- పోలీసుల అదుపులో నిందితులు



అభిషేక్ మృతదేహం

నెల్లూరు(క్రైం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని కొండాయపాలెం ప్రాంతం సోమవారం ఒక్కసారిగా ఉలిక్కిపడింది స్వల్ప వివాదం ఓ యువకుడి నిండు ప్రాణంతీసి, అతడి కుటుంబంలో విషాద ఛాయలు మిగిల్చింది. ముగ్గురిపై కొందరు దాడి చేయడంతో ఓ యువకుడు మృతిచెందగా, మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. పోలీసుల సమాచారం మేరకు, కొండాయపాలెంలో గంట కిరణ్-సురేఖ దంపతులు నివాసం ఉంటున్నారు. కిరణ్ క్యాటరింగ్ పనులు చేసుకుంటుండగా, పెద్ద కుమారుడు ఉదయ్‌కుమార్ డెకరేషన్ పనులు చేస్తున్నాడు. చిన్న కొడుకు అభిషేక్(23) ఓ ల్యాబ్‌లో పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన దాసు వారికి దూరపు బంధువు. దాసు మద్యానికి బానిసై నిత్యం అసభ్యకర పదజాలంతో వారిని దూషించేవాడు. ఆదివారం రాత్రి దాసు అసభ్య పదజాలంతో గట్టిగా కేకలు వేస్తుండగా అక్కడున్న ఉదయ్‌కుమార్ వారించాడు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ జరిగింది. ఉదయ్‌కుమార్ చేయిచేసుకోవడంతో కోపంతో రగిలిపోయిన దాసు జరిగిన విషయాన్ని తన భార్య, అత్త, పడారుపల్లిలోని బావమరదులు శ్రీకాంత్, శ్రీనివాసులు, స్నేహితుడు సూర్యకు చెప్పాడు. అంతా కలిసి ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక కొండాయపాలెంకు చేరుకున్నారు. ఉదయ్‌కుమార్‌తో ఘర్షణకు దిగారు. అక్కడే ఉన్న అభిషేక్, ఉదయ్‌కుమార్ , అతని స్నేహితుడు ప్రవీణ్ అలియాస్ చింటూ వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారు తమ వెంట తెచ్చుకున్న మారణాయుధాలతో విచక్షణారహితంగా ముగ్గురిపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో అభిషేక్ తలకు తీవ్రగాయం కావడంతో మృతి చెందాడు. ఉయక్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రవీణ్‌కు తీవ్రగాయాలు కావడంతో నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం అతను పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఉదయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేశారు. పలువురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

నార్తుమోపూరు హత్యకేసు నిందితుల అరెస్టు

- అదుపులోకి ఏడుగురు.. పరారీలో ఒకరు
- సుత్తి, మూడు కర్రలు, నాలుగు మోటారు సైకిళ్ల స్వాధీనం
- డీఎస్పీ శ్రీధర్ వివరాలు వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్, పక్కన సీఐ, ఎస్ఐ

కావలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నార్తు మోపూరు చేజర్ల కార్తీక్ హత్య కేసులోని 8మందిపై కేసు నమోదు చేయగా అందులో 7గురు నిందితులను ఆదివారం సాయంత్రం 5గంటలకు అల్లూరుపేట సెటిల్‌మెంట్ రోడ్డు జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు కావలి డీఎస్పీ పీ.శ్రీధర్ తెలిపారు. మరో నిందితుడు మనోజ్ పరారీలో ఉన్నారన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో సర్కిల్ సీఐ పాపారావు, అల్లూరు ఎస్ఐ కిషోర్‌బాబుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నూతన సంవత్సరం సందర్భంగా నార్తుమోపూరు హరిజనవాడ కొమ్మిసుధీర్, తుమ్మతాటి ఆదిత్య, కొమ్మి నరేష్, మనోజ్‌లు మరికొంతమందితో కలసి అర్ధరాత్రి దాటిన తర్వాత నార్తుమోపూరుసెంటర్‌లో మోటారుసైకిళ్లపై పెద్దగా అరుస్తూ తిరుగుతు న్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న అరుంధతీయవాడకు చెందిన జంపాల నిరంజన్ కలుగచేసుకుని ఎందుకు అరుస్తున్నా రని అడిగారు. దీంతో వారు ఆయనతో గొడవ పెట్టుకోగా మోడెం అనిల్ వారికి సర్ది చెప్పి పంపించడంతో సమస్య సద్దుమణిగింది. ఈ గొడవను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 3వ తేదీన నార్తుమోపూరు హరిజనవాడ కొమ్మి సుధీర్, తుమ్మాటి ఆదిత్య, కొమ్మి నరేష్, అరగలపాలు, కొమ్మి అహా రాన్, అజ్జం హేమంత్‌కుమార్, కోటపూడి జగదీష్, మనోజ్‌లు మోటారు సైకిళ్లపై సుత్తి, కర్రలు పెట్టుకుని అరుందతీయవాడ రోడ్డు సెంటర్‌కు వెళ్లారు. అక్కడ నిరంజన్, శివకుమార్‌తో గొడవపడ్డారు. ఆ సమయం లో కార్తీక్ అడ్డురావడంతో నిందితులందరూ ఆయన్ను గట్టిగా పట్టుకోగా సుధీర్ సుత్తితో కార్తీక్ తలపై వెనుకభాగంలో గట్టిగా కొట్టడంతో బలమైన రక్తగాయాలు అయ్యాయి. చికిత్సపొందుతూ అదేరోజు రాత్రి కార్తీక్ మరణించాడు.

పేకాట స్థావరంపై దాడి

మర్రిపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగినేనిగుంట అటవీ ప్రాంతంలో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఆత్మకూరు సీఐ గంగాధర్‌కి వచ్చిన సమాచారంతో ఆయనతో పాటు మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసులు, ఆత్మకూరు ఎస్ఐ జిలాని సిబ్బంది కలిసి పేకాట స్థావరంపై దాడిచేసి జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.12వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో బియ్యం లారీ

దగదర్తి (బిట్రగుంట) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై స్థానిక ఎస్ఐ జంపానికుమార్ సిబ్బందితో సోమవారం తనిఖీలు నిర్వహించారు. అల్లూరు రోడ్డు సున్నపుబట్టి మధ్య కందుకూరు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ డ్రైవర్ రాజశేఖర్‌ను ఎస్ఐ విచారించారు. పొంతన లేని సమాధానం ఇవ్వడంతో లారీతో పాటు 540 బస్తాల బియ్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కావలి రూరల్ సీఐ పాపారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు తహసీల్దారుకు సమాచారం అందజేశామన్నారు.



పోలీసుల అదుపులో ఉన్న లారీ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7423
వెండి కిలో ధర	రూ.90,800
వెండి ఒక గ్రాము	రూ.93.80

అయ్యా.. మాగోడు వినండి!

- కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు
- ప్రజాసమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం

నెల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అర్జీదారులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి భారీసంఖ్యలో ప్రజలు వివిధ సమస్యలతో వినతులు తీసుకువచ్చారు. కలెక్టర్ ఓ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్‌లతోపాటు జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 247 అర్జీలు రాగా, అందులో రెవెన్యూశాఖవి 138, మున్సిపల్ శాఖవి 21, సర్వేశాఖవి 17, పంచాయతీరాజ్ శాఖవి 14, సివిల్ సప్లయిస్‌వి 8 అర్జీలు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ప్రజా సమస్యలను నిర్దీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

● ట్రైసైకిళ్ల తయారీని పునఃప్రారంభించాలి

దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయం పరిధిలో ఉన్న ట్రైసైకిళ్ల కర్మాగారాన్ని పునఃప్రారంభించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి నేతలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే కాలేషా మాట్లాడుతూ నెల్లూరులో ఉన్న కర్మాగారంలో గతంలో ట్రైసైకిళ్లను తయారు చేసి పంపిణీ చేసేవారని, కొంత కాలంగా ఇక్కడ తయారీ నిలిపివేసినట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల కార్పొరేషన్ అధికారులు ఉద్దేశపూర్వకంగా కర్మాగారాన్ని మూసివేశారని అన్నారు. దీనిని పునరుద్ధరించాలని కోరారు.



ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- అదనపు ఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 71 మంది తమ సమస్యలపై పోలీసు అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సౌజన్య మాట్లాడుతూ వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నిం టిపై చట్టప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సీహెచ్ సౌజన్య

ప్రతిరోజూ లక్ష పనిదినాలు లక్ష్యం

'ఉపాధి'పై దృష్టి పెట్టండి : కలెక్టర్

నెల్లూరు (జడ్పీ), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ లక్ష పనిదినాలు లక్ష్యంగా ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ హాలులో ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పంచాయతీరాజ్, సీసీ రోడ్ల గ్రౌండింగ్, ఎంఎస్‌ఎంఈ సర్వే, ఎస్టీలకు ఆధార్‌కార్డుల జారీ, పీఎం సూర్యఘర్ యోజన పథకం అమలు... తదితర అంశాలపై సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల వేగం పెంచాలని, ప్రతిరోజూ లక్ష పనిదినాలు లక్ష్యంగా ఎంపీడీవోలు, ఏపీవోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీసీ రోడ్లు, పశువుల షెడ్ల నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల్లో చేపట్టిన మంచినీటి వసతి, టాయిలెట్ల నిర్మాణ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. మార్చిలోగా 10,369 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. హౌసింగ్ అధికారులు ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆధార్‌కార్డులు లేక ఎలాంటి ప్రభుత్వ రాయితీలు పొందలేకపోతున్న ఎస్టీల పట్ల మానవతాదృక్పథంతో వ్యవహరించాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జేసీ కే కార్తీక్, డీఆర్వో ఉదయ భాస్కర్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వేణుగోపాల్, గంగా భవాని, నాగరాజకుమారి, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు విజయన్, వెంకటరమణ, డీఎంహెచ్‌వో సుజాత, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్, డీఈవో బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పంట కాలువలో స్కూలు బస్సు బోల్తా

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు
- పాఠశాల కరస్పాండెంట్‌పై తల్లిదండ్రుల ఆగ్రహం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : బ్రేక్ ఫెయిల్, స్టీరింగ్ పట్టేయడంతో అదుపు తప్పిన ఓ ప్రైవేటు స్కూలు బస్సు సోమవారం పంట కాలువలోకి బోల్తా కొట్టింది. మినగల్లు, సాల్మానుపురం గ్రామాల మధ్య జరిగిన ఈ ఘటనలో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. నెల్లూరురూరల్ మండలం కొండ్లపూడి పంచాయతీ కొళ్లపూడి సంఘం పక్కనే ఉన్న శ్రీనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూలుకు చెందిన బస్సులో 23 మంది విద్యార్థులు ఎక్కారు. మార్గమధ్యంలో బ్రైకొఫెయిల్ కావడం, స్టీరింగ్ పట్టేసి అదుపుతప్పడంతో రోడ్డుకు ఎడమవైపు వెళ్తున్న బస్సు కుడివైపు రోడ్డుదాటి ఊటుకాలువలోకి బోల్తా కొట్టింది. దీంతో బస్సులో ఉన్న చిన్నారులు ఒకరిపై ఒకరు పడటం, బిగ్గరగా కేకలు వేయడంతో స్థానిక రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్, క్లీనర్ బస్సు ముందు పగిలిన అద్దంలో నుంచి విద్యార్థులను బయటకు తీశారు. ఐదుగురు విద్యార్థులు గాయపడటంతో వారిని ఆసుపత్రికి తరలించారు. కాలువలో నీరు తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు. క్రేన్ సహాయంతో బస్సును వెలికి తీయించారు. వెంటనే అక్కడకు చేరుకున్న స్కూలు కరస్పాండెంట్ కాకాణి శ్రీనివాసరావుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కండీషన్‌లేని బస్సుతో తమ పిల్లల ప్రాణాలు తీసేస్తారా అంటూ మండిపడ్డారు. కాగా ఈ ప్రమాద విషయం తెలుసుకున్న మినగల్లు సర్పంచు బొర్రు పూజిత భర్త రాము, బుచ్చి, నెల్లూరు రూరల్ ఎంఈవోలు పీవీ.రత్నంలతో పాటు పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. గాయపడిన చిన్నారులు సమీర్, క్రాంతి సందేశ్, సుకుమార్, అక్షితలను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, ఈ ఘటనలో గాయపడిన విద్యార్థులను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.



పంట కాలువలోకి బోల్తాపడిన స్కూలు బస్సు

11 నుంచి జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న అండర్-17, 12న అండర్-23 జిల్లా జట్లను లీగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి డీనిఖిలేశ్వర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని క్రీడాకారులకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోనూ, కావలి, గూడూరు, వెంకటగిరి ప్రాంతాల క్రీడాకారులకు స్థానిక క్రికెట్ శిక్షణ ప్రాంగణాల్లోనూ ఎంపికలుంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత తేదీల్లో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు క్రీడా ప్రాంగణాల్లో సంప్రదించాలని తెలిపారు.

రేపు టౌన్‌హాలులో యువ ఉత్సవ్

నెల్లూరు(విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్‌వైకే ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని టౌన్‌హాలులో యువ ఉత్సవ్ నిర్వహించనున్నటులల యువజన అధికారి మహేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్యగల యువతకు సైన్స్ ఎగ్జిబిషన్, వక్తృత్వ, వ్యాసరచన, మొబైల్ ఫోటోగ్రఫీ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేస్తామన్నారు. ఆసక్తి కలిగినవారు ఆరోజు ఉదయం 9 గంటలకు టౌన్‌హాలులో హాజరు కావాలని తెలిపారు.

లైంగిక దాడి కేసులో వైసీపీ నేతకు రిమాండ్ పొడిగింపు

వెంకటాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): లైంగిక దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యకు న్యాయస్థానం మరో 11 రోజులు రిమాండ్ పొడిగించింది. ఉద్యోగం ఆశ చూపి ఓ మహిళపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన కేసులో వెంకటశేషయ్యకు విధించిన 14 రోజుల రిమాండ్ సోమవారంతో ముగిసింది. దీంతో పోలీసులు వెంకటశేషయ్యను న్యాయస్థానంలో హాజరు పరచగా దర్యాప్తు ఇంకా పూర్తి కాకపోవడంతో ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు. దీంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత


ముత్తుకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపూడి గ్రామ పంచాయతీలోని బసరాల దిబ్బ గిరిజనకాలనీ సమీపంలో ఉన్న చేపల చెరువులో మేతగా వేసేందుకు కుళ్లి, దుర్వాసన వచ్చే చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సర్వేపల్లి జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అడ్డుకుని పోలీసులకు అప్పజెప్పారు. పక్క రాష్ట్రాల నుంచి చికెన్ వ్యర్థాలను భారీగా తెస్తున్నారని, దీని దుర్వాసనతో తట్టుకోలేకపోతున్నామని గిరిజనులు జనసేన నేతలకు ఫిర్యాదు చేయగా జనసైనికులు సోమవారం తెల్లవారు జామున కాపుకాశారు. చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలించే వాహనాన్ని పట్టుకున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులు ఫిర్యాదు చేశారు. మత్స్యశాఖ అధికారులు చేపలు సాగు చేస్తున్న రైతులకు ఇలాంటి చికెన్ వ్యర్థాలను మేతగా వాడరాదని అవగాహన కల్పించాలని కోరారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రక్కు

చెరువులో కలిపేందుకు తెచ్చిన చికెన్ వ్యర్థాలు

రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లోని నాలుగో నెంబరు ప్లాట్‌ఫారమ్‌పై సోమవారం గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండవచ్చని, బ్లూ కలర్ జెర్సీ బ్రౌన్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించి ఎస్ఐ ఎస్ హరిచందన కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

మద్యపానం చేయిస్తున్న వ్యక్తి అరెస్టు

నెల్లూరు(క్రైం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డాబాలో అనుమతులు లేకుండా మద్యపానం చేయిస్తున్న వ్యక్తిని నెల్లూరు-1 ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని కొండాయపాలెం రోడ్డులో వైన్ షాపు పక్కనే డాబా ఏర్పాటు చేసుకుని, అనుమతి లేకుండా మద్యపానం చేయిస్తున్న వెంకట సురేంద్రరెడ్డిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై వైద్యశాలలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు నగరంలోని బాలాజీనగర్ సీఆర్పీ డొంకలో బీబీజాన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు అల్తాఫ్ ఈనెల 5న బైక్‌పై భగత్‌సింగ్ కాలనీకి వెళ్లాడు. అక్కడ పని ముగించుకొని ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా ఇంటికి వెళుతుండగా, బ్రిడ్జి చివర మలుపువద్ద బైక్ అదుపుతప్పిపడడంతో అల్తాఫ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి అల్తాఫ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి యువకుడు మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి తల్లి బీబీజాన్ నార్త్ ట్రాఫిక్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్ట్ షాపులపై దాడులు

చేజర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకంభంపాడు గ్రామంలో బెల్ట్ షాపులపై సోమవారం సాయంత్రం పొదలకూరు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామంలో రెండు దుకాణాలపై దాడులు నిర్వహించి 60కి పైగా మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వ్యాసరచన పోటీలు

ఉదయగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో సోమవారం ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ మాట్లాడారు. సావిత్రిబాయి పూలే, ఫాతిమాబేగం జీవిత చరిత్రలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్‌రసూల్, కమిటీ సభ్యులు ఫరీద్‌బాషా, అన్వర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన చేజర్ల కార్తీక్ కుటుంబసభ్యులను సోమవారం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పరామర్శించారు. మృతుడి తల్లిదండ్రులు ఘటనను వివరిస్తూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎమ్మెల్యే వారిని ఓదార్చి ఆర్థికసాయాన్ని అందిస్తామన్నారు. అనంతరం తూర్పు గోగులపల్లి టీడీపీ నేత ముంతా రమేష్ తల్లి మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కావలి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక దినసరి కూలీగా జీవనం సాగిస్తున్న ఇనగంటి మాల్యాద్రి పక్షవాతంతో మంచం పడ్డారు. విషయం తెలుసుకున్న బెస్ట్ వా కర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం రూ.11వేలు అందజేశారు. తహసీల్దారు కార్యాలయం ఎదురుగా సంఘం అధ్యక్షుడు తోట శేషయ్య, వన్‌టౌన్ ఎస్సై జానకిరామిరెడ్డి, మందా వెంకటేశ్వర్లు, భాస్కర్‌నాయుడు, బత్తిన శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

కొండాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాధికారి-2 ఆనందరావు తెలిపారు. సోమవారం గొట్టిగుండాల జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలిచ్చి రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన మెనూ పాటించాలన్నారు.

కంపచెట్ల తొలగింపు

కొండాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గుడవర్లూరు పంచాయతీలోని సచివాలయ నూతన భవనానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. భవనం ముందున్న కంపచెట్లను ప్రొక్లయిన్‌తో తొలగింపజేశారు. సచివాలయ సిబ్బంది పంచాయతీ భవనంలోని ఒక గదిలోనే విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ మాచర్ల ఎంపీడీవో ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ మెయిన్ బ్రాంచ్ మార్పు

కావలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తుమ్మలపెంట రోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌ని ఖాతాదారుల సౌకర్యార్థం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోకి మార్చినట్లు సోమవారం రీజనల్ మేనేజరు చీమకుర్తి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ బెజవాడ రవి కుమార్ పాల్గొన్నారు. ఖాతాదారులకు సులభతరంగా సేవలు అందించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజరు లక్ష్మీనారాయణ, సెంట్రల్ జీఎస్టీ మెంబరు, భవన యజమాని వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

అభినందనలు

ఉదయగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో చదువుతున్న సయ్యద్ యాకూబ్ అనే దివ్యాంగ విద్యార్థిని సోమవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు అభినందించారు. గతనెల 19న వెంకటాచలం సీఆర్పీ సెంటర్‌లో జరిగిన పారా ఒలంపిక్స్ గేమ్స్ దివ్యాంగుల జూనియర్ రన్నింగ్ విభాగంలో యాకూబ్ పాల్గొని ద్వితీయ స్థానం సాధించడంతో ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. అనంతరం భవిత కేంద్రం రికార్డులను పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసింహా, శివనందిని, సుభాషచంద్రబోస్ పాల్గొన్నారు.

అర్హత పరిశీలన

ఆత్మకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగవైకల్యం, పక్షవాతంతో మంచానికి పరిమితమై నెలకు రూ. 15000 పింఛను పొందుతున్న లబ్ధిదారుల అర్హతను వైద్యబృందం సోమవారం పరిశీలించింది. అప్పారావుపాళెం, బట్టేపాడు, నల్లపురెడ్డిపల్లి, నువ్వూరుపాడు, దేపూరు, బండారుపల్లి, రామస్వామిపల్లి, నాగులపాడు, చెర్లోయడవల్లి, కరటంపాడు, బి.చిరువెళ్ల, నబీనగరం, వాశిలి పంచాయతీలకు సంబంధించిన 23మంది పింఛనుదారుల ఇంటికి స్వయంగా వెళ్లి వారి అర్హతలను వైద్యబృందం పరిశీలించింది. కార్యక్రమంలో డాక్టర్ మునిమురళీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేష్‌కుమార్, శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, విస్తరణాధికారి డేవిడ్, కార్యదర్శి ఆనంద్ ఉన్నారు.



పేరుకే ఏరియా వైద్యశాల

- 2 గంటలే వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు
- పలు సేవల్లో సిబ్బంది చేతివాటం
- కొత్తభవనం నిర్మించినా మౌలిక వసతుల కరువు



కావలిలోని ఏరియా వైద్యశాల అత్యవసర విభాగం భవనం

కావలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):డివిజన్ కేంద్రంలోని ఏరియా వైద్యశాలలో వైద్యసేవలు సక్రమంగా అందటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వైద్యులు, సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కొందరు డాక్టర్లు విధులకు తరచూ డుమ్మా కొడుతుండగా మరికొందరు ఉదయం 10గంటలకు విధులకు వచ్చి మధ్యాహ్నం 12గంటలకే ఇళ్లకు వెళుతున్నారు. రోజుకి రెండు గంటలే వారు విధులు నిర్వర్తిస్తున్నారనే స్థానికులు చెబుతున్నారు.

● ఆరోగ్యశ్రీ నిధుల్లో చేతివాటం

ఆరోగ్యశ్రీ ద్వారా చేసిన ఆపరేషన్లకు వచ్చిన ప్రభుత్వ నిధులు కొందరు డాక్టర్లు మాత్రమే వాటిని మింగేస్తున్నారనే విమర్శలున్నాయి. నిధుల పంపిణీలో డాక్టర్ల మధ్య వచ్చిన విభేదాలతో ఈ విషయం బయటకు వచ్చిందని చెబుతున్నారు. రోగులకు అందించే ఆహారం కూడా సక్రమంగా ఇవ్వలేదని చెబుతు న్నారు. సదరన్ సర్టిఫికెట్ల మంజూరులో కూడా ముగ్గురు డాక్టర్ల టీం పైనల్ చేసేటపుడు పైసలిచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తూ దళారీవ్యవస్థ నడుస్తోందనే చర్చించుకుంటున్నారు. వైద్యశాలలో అన్నిపరీక్షలకు ల్యాబ్‌న్నా సక్రమంగా వినియోగించక బయట ల్యాబ్‌ల వద్ద పర్సెంటేజీలు తీసుకుంటున్నారు.

● ఎమ్మెల్యే సీరియస్ వార్నింగ్

వైద్యశాల దుస్థితినిస్థానిక నాయకులు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని యామకాల్లో వైసీపీ నాయకుల పెత్తనం జరుగుతోందని అందువల్లే వారు సక్రమంగా విధులు నిర్వహించటం లేదని లిఖితపూర్వకంగా ఎమ్మెల్యే వివరాలు ఇచ్చారు. ఈ విషయంపై ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, వైద్యులతో సమావేశమై పద్ధతులు మార్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు.

● మౌలిక వసతులు కరువు

ఏరియా వైద్యశాల భవనంలో అన్ని వసతులు సమకూర్చక ముందే దాన్ని ప్రారంభించారు. దీంతో మంచినీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులు కరువయ్యాయి. వైద్యశాల ఆవరణలో కొత్తరోడ్డును నిర్మించాల్సి ఉన్నా కాంట్రాక్టర్ దాని జోలికి వెళ్లడం లేదు. పాత భవనాలు తొలగించినపుడు ప్రహరీని తొలగించారు. ఇప్పటివరకు దాని నిర్మాణం చేపట్టక పోవడంతో పందులు, పశువులు, కుక్కలు ఆసుపత్రి ఆవరణలో తిరుగుతున్నాయి.

త్వరలో రాత్రిబడుల నిర్వహణ

● నాగేశ్వరప్రసాద్, మర్రిపాడు ఎంపీడీవో

ఇంటర్వ్యూ...



మర్రిపాడు,జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలలో ఉల్లాస్ కార్యక్రమం పేరుతో ప్రభుత్వం త్వరలో రాత్రి బడులు నిర్వహించ నుందని ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్ సోమవారం తెలిపారు.

? మండలంలో నిరక్షరాస్యులను గుర్తించారా.

! ఇప్పటికే అన్ని గ్రామాల్లో 75శాతం సర్వే పనులు నిర్వహించాము.

? నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ఏదైనా ప్రయత్నం చేస్తున్నారా.

! జాతీయ ఉపాధి హామీ పథకంలో 100రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల పిల్లలకు కంప్యూటర్, ఎలక్ట్రానిక్ వంటి పనులపై ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అట్టివారిని గుర్తిస్తున్నాము.

? ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

! రూ.1.85 కోట్లతో సీసీరోడ్లు, 54 మినీ గోకులాల నిర్మాణం జరుగుతున్నాయి.

స్రైడ్ సంస్థకు పురస్కారం



ఆత్మకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన స్రైడ్ స్వచ్ఛంద సంస్థకు మదనపల్లికి చెందిన గ్రామజ్యోతి సొసైటీ, ముంబయికి చెందిన మూమెంట్ ఇండియా, కేరళకు రెందిన యూఆర్‌సీ సంస్థలు సంయుక్తంగా సోమవారం పురస్కారం అందజేశారు. స్రైడ్ సంస్థ డైరెక్టర్ వాగాల శ్రీహరికి గ్రామజ్యోతి సొసైటీ అధ్యక్షురాలు సుభద్ర, మూమెంట్ ఇండియా ఆర్గనైజేషన్ డైరెక్టర్ శ్యామ్ జోషి తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందజేసి అభినందించారు.

ఇళ్ల దరఖాస్తు నమోదులో అధికారుల వేధింపులు

- వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు
- దివ్యాంగులతో కలిసి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

కావలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులను సచివాలయ ఉద్యోగులు రకరకాల ప్రశ్నలతో వేధిస్తున్నారని వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు తెలిపారు. ఈ విషయంపై ఆయన దివ్యాంగులతో కలిసి స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం, తుమ్మలపెంటతో పాటు కావలి పట్టణ ముసునూరు తదితర సచివాలయ ఉద్యోగులు ఇళ్ల మంజూరు దరఖాస్తులు స్వీకరించకుండా ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే స్థలం సర్వే నంబరు తెమ్మంటున్నారని దాని కోసం వీఆర్వోలను అడిగితే వారు ఇవ్వటం లేదని వాపోయారు. దివ్యాంగులకు స్థల సర్వే నంబర్లు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. సచివాలయంలో దరఖాస్తు ఇస్తే వాటిని పక్కన పడేసి రశీదులు కూడా ఇవ్వటంలేదన్నారు. స్పందించిన ఆర్డీవో సంబంధిత సచివా లయ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. దివ్యాంగులను ఇబ్బంది పెట్టకుండా దరఖాస్తులు తీసుకుని నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే డివిజన్ గృహనిర్మాణశాఖ ఈఈ మాధవరావుతో దివ్యాంగులకు నిబంధనల మేరకు ఇళ్లు మంజూరు చేయాలన్నారు.

ఐవోసీ పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థలం అప్పగింత

● నిర్మాణానికి మార్కింగ్ చర్యలు ● మూసుకు పోతున్న కార్యాలయాలు ● ఆందోళనలో ప్రజలు



పెట్రోల్ బంకు కోసం ఇచ్చిన స్థలంలో చుట్టూ కట్టిన పరదాలు

కావలి, జనవరి6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) పెట్రోలు బంకు నిర్మాణం పనులు నిర్వాహకులు చర్యలు తీసుకోవడంతో కార్యాలయ ఆవరణం మొత్తం కుదించుపోయ్యిందని అధికారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే తహసీల్దార్ కార్యాలయంతో పాటు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం, మండల వ్యవసాయాధికారి కార్యాలయం, రూరల్ పోలీస్‌స్టేషన్, కావలి పోలీస్ సర్కిల్ కార్యాలయం, సబ్‌జైలు, ఉప ఖజానా కార్యాలయం, వాతావరణ శాఖ కార్యాలయాలు ఉన్నాయి. కార్యాలయాలకు వచ్చే వాహనాలు పార్కింగ్ స్థలం లేకుండా పోతుందని అన్ని కార్యాలయాలు అధికారులు, సిబ్బందితో పాటు పట్టణ ప్రజలు.. అక్కడ పెట్రోల్ బంకు వద్దని వ్యతిరే కిస్తున్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లాలని భావిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ పెట్రోల్ బంకు కోసం 20సెంట్లు స్థలంను అప్పటి ఎమ్మెల్యే ఒత్తిడి మేరకు రెవెన్యూ అధికారులు కేటాయించారు. స్థలాన్ని సర్వేచేసి ఐవోసీకి అప్పగించటంతో వారు దాని చుట్టూ పరదాలు కట్టి నిర్మాణానికి మార్కింగ్ వేశారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే కాకర్ల



షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

సీతారామపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని నియోజకవర్గ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. బసినేనిపల్లి పంచాయతీలోని ఎస్‌ఆర్‌నగర్‌లో సోమవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన మినీ గోకులమును ప్రారంభించి మాట్లాడారు. రైతన్నలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. అనంతరం పోలంగారిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తెలుగుదేశం కార్యకర్త గడ్డం వీరాంజనేయులు పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. బసినేనిపల్లిలో పొన్నుబోయిన చెంచల్ బాబు యాదవ్‌తో కలిసి డాబాను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా టీసీ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, జనసేన భోగినేని కాశీరత్తయ్య, సర్పంచ్‌లు, ఆదినారాయణ, వెంకటసుబ్బయ్య, మాజీ జడ్పీటీసీ జ్యోతి, చంద్రరెడ్డి పాల్గొన్నారు.

● క్రీడల అభివృద్ధికి 10శాతం ఎమ్మెల్యే నిధులు

వింజమూరు: ఎమ్మెల్యే నిధుల నుంచి 10 శాతం క్రీడల అభివృద్ధికి ఉపయోగిస్తానని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం వింజమూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న వీఎంసీఏ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా వచ్చే ఏడాది నుంచి ఎమ్మెల్యే నిధుల నుండి 10 శాతం క్రీడల అభివృద్ధికి ఉపయోగిస్తానని తెలిపారు. వీఎంసీఏ టోర్నమెంట్ ఆర్గనైజర్‌లను అభినందించారు. కాగా, ఫిబ్రవరి నెలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకుడు గణపం సుదర్శన్‌రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, వింజమూరు ఎస్‌ఐ వీరప్రతాప్, వీఎంసీఏ టోర్నమెంట్ ఆర్గనైజర్ సంధాని, దాతలు పల్లాల ప్రసాద్, ఈస్ట్ వర్డ్ కరస్పాండెంట్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు రహదారుల మరమ్మతులు పూర్తి

● రోడ్లు, భవనాల శాఖ ఈఈ మురళీకృష్ణ




పొదలకూరు-సోమశిల రోడ్డును పరిశీలిస్తున్న ఈఈ మురళీకృష్ణ

కలువాయి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు డివిజన్ పరిధిలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులు ఈనెలాఖరు నాటికి పూర్తిచేస్తామని రోడ్లు, భవనాల శాఖ ఈఈ మురళీకృష్ణ తెలిపారు. కలువాయి మండలంలో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు, నెల్లూరు అర్బన్, నెల్లూరు రూరల్, వెంకటగిరి నియోజక వర్గాల పరిధిలోని 18 మండలాల్లో దెబ్బతిన్న 48 రహదారుల మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. కలువాయి మండలం రాజుపాళెం పరమానంద ఆశ్రమం సమీపంలో పొదలకూరు- సోమశిల రోడ్డుకు పడిన గండి వద్ద వంతెన నిర్మాణం కోసం రూ.70లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆయన వెంట ఆత్మకూరు ఇన్‌చార్జి డీఈ అమానుల్లా ఖాన్, ఏఈ అన్వేష్ ఉన్నారు.

వైసీపీ నిర్లక్ష్యంతోనే ఆయకట్టుదారులకు అవస్థలు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబు



మాట్లాడుతున్న చెంచలబాబు

ఉదయగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి జలాశయాలను విస్మరించడంతో ఆయకట్టు రైతులు అవస్థలు పడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాయం ఆవరణలో ఛైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షతన 17 డిస్ట్రిబ్యూటరీల సాగునీటి సంఘాధ్యక్షులు, ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గండిపాళెం జలాశయానికి నిధులు మంజూరు చేయకపోవడంతో కుడి, ఎడమ కాలువలు పూర్తిగా పూడిపోయి సక్రమంగా సాగునీరు అందక ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయన్నారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, సమస్యను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల దృష్టికి తీసుకెళ్లి కాలువల్లో పూడిక తీయించి చివరి ఆయకట్టు వరకు సాగునీరందేలా చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం జలాశయంలో 21 అడుగుల మేర నీటిమట్టం ఉండడంతో మెట్ట పంటల సాగుకు ఈ నెల 24న కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేసేలా తీర్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి, ఏఈలు వేణు సురేష్, వైస్ ఛైర్మన్ రమణారెడ్డి, సాగునీటి సంఘాధ్యక్షులు పాల్గొన్నారు.

నేటి నుంచి పబ్లిక్ హియరింగ్

కందుకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నూతన టారీఫ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణకు ఈ నెల 7, 8, 10 తేదీల్లో స్థానిక డివిజనల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంతో పాటు డివిజన్ పరిధిలోని పొన్నలూరు, సింగరాయకొండ, జరుగుమల్లి, కొండపి మండలాల విద్యుత్ వినియోగదారులు ఈనూతన టారీఫ్‌లపై తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధిఇకి చేయూత నివ్వండి

కావలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వివరాలు తెలిపారు.

పొలం హద్దులు చూపాలని వినతి

బిట్రగుంట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌కు భూ సమస్యలపై నాలుగు వినతులు వచ్చినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. జేపీ గూడూరులో పొలం కొలతలు వేయాలని ముగ్గురు రైతులు, అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటకు చెంది మహిళ పొలం హద్దులు చూపించాలని కోరినట్లు తహసీల్దారు తెలిపారు. చాలావరకు గ్రామ రెవెన్యూ సభలో సమస్యలకు పరిష్కారం జరుగుతుందన్నారు.

టీఆర్‌ఆర్‌లో యూత్ గేమ్స్ పోటీలు

కందుకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ యూత్ గేమ్స్ అండ్ అథ్లెటిక్స్ పోటీలు సోమవారం ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ పోటీల్లో టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు శ్రీ గాయత్రీ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో విభాగంలో శ్రీ గాయత్రీ డిగ్రీ కళాశాల విద్యార్థినీలు విజేతలుగా నిలవగా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బంగారు పతకం, షీల్డ్ అందజేశారు. అలాగే 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ పోటీల విజేతలను కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు, డైరక్టర్ భరద్వాజ్, ప్రిన్సిపాల్ గీతా శ్రీనివాసరావులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. రవికుమార్, పీడీ కరుణకుమార్ ఉన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మదాపురం గ్రామంలో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ డీ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ పశువులకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పశు సహాయ సంచాలకులు ఎస్ చంద్రశేఖర్, పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆత్మకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు సుధీర్ తెలిపారు. సోమవారం మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం, వాశిలిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభల కరపత్రాల పంపిణీ

ఉదయగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో వచ్చేనెల 1, 2, 3వ తేదీల్లో నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం పట్టణంలో సీపీఎం నాయకులు ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, బస్టాండ్ ప్రాంతాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, గడ్డం నాగేశ్వరరావు, కోడె రమణయ్య, నాయబ్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

అనంతసాగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పాతదేవరాయపల్లి, అనంతసాగరం ఉర్దూ పాఠశాలలను సోమవారం ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఖాజామొహిద్దీన్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును ప్రతిరోజు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్యపై భర్త దాడి

అనంతసాగరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త దాడిచేసిన సంఘటన సోమవారం ఆమనిచిరివేళ్లలో వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఉంటున్న షేక్ నఫియా, అతని భర్త హమ్మద్‌బాషాకు కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈనేపథ్యంలో మద్యం సేవించి నఫియాపై కత్తితో దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

క్రీడా దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న దాత మస్తాన్‌రెడ్డి, తదితరులు

అల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ఆలోచనలు మెరుగ్గా ఉండాలని వారిలో వారికి బేదాలు ఉండకూడదని దాత మేడా మస్తాన్‌రెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం దాతలు మేడా మస్తాన్‌రెడ్డి సమకూర్చిన రూ.86వేల విలువ చేసే క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. 234 మందికి దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో అవధాని కోట రాజశేఖర్, మేడా రామసుబ్బారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, సిద్దా యానాది శెట్టి, దమ్మాల బ్రహ్మానందం, సిద్దా వెంకట రమణయ్య, బిట్రగుంట చైతన్య రెడ్డి, మేడా మాధవ, శ్రీనివాసులు, అభివృద్ధి కమిటీ కన్వీనర్ జి.చెంచయ్య పాల్గొన్నారు.

భవనాల నిర్మాణానికి కొలతల సేకరణ



భవనాల నిర్మాణానికి కొలతలు సేకరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

ఉదయగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో భవనాల నిర్మాణానికి సోమవారం ట్రాన్స్‌కో సివిల్ ఇంజనీరింగ్ అధికారులు కొలతలు సేకరించారు. ఈ సందర్భంగా ఈఈ కె శ్రీనివాసులు మాట్లాడుతూ 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గతంలో ఉన్న ఏడీఈ కార్యాలయ భవనం, ప్రహరీ తొలగించారని, దీంతో నూతనంగా ఏడీఈ, ఏఈ, ఈఆర్‌వో భవనాల నిర్మాణంతోపాటు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు కోటేశ్వరరావు, వై శ్రీనివాసులు, ఏఈలు ఖుద్దూష్ బాషా, ప్రసాద్, పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కందుకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సబ్‌డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు ఈనెల 7న పట్టణంలోని వెంగమాంబ కల్యాణమండపంలో ఒంగోలు ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు మహమ్మద్ జహంగీర్‌సుల్తాన్ సోమవారం ప్రకటనలో తెలిపారు.

నాయకుల ఔదార్యం

సంగం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనసూయనగర్‌లో మూడురోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులను సోమవారం సాయంత్రం మండల టీడీపీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి పరామర్శించి రూ.10వేలు అందచేశారు. విషయాన్ని మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్లి చిన్నారులకు నెలనెలా పింఛన్‌తో పాటు, ప్రభుత్వం సాయం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, హజరత్ ఉన్నారు.

'మార్పు' సేవలు చిరస్మరణీయం

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): విద్యా రంగానికి మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ చేసిన సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శేషారెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లురెడ్డి, ఆర్ రామసుబ్బారెడ్డి, సిహెచ్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యులకు ఈకేవైసీ తప్పనిసరి

● జిల్లా సహకారశాఖాధికారి గురప్ప

? సహకార సంఘాల సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాలా.



! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ప్రతి పీఏసీఎస్ సభ్యుడు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి.

? ఈకేవైసీ ఎక్కడ చేయించాలి.

! సహకార సంఘాల సభ్యులు ఈకేవైసీని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది మొబైల్ అప్లికేషన్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలి. సచివాలయ సిబ్బంది ప్రతి సభ్యుడి ఇంటికి వెళ్లి సభ్యుల వివరాలను ఈకేవైసీ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఎలాంటి సందేహం లేకుండా సచివాలయ సిబ్బందికి ఈకేవైసీ కోసం ఆధార్ కార్డు అందచేయాలి.

? సహకార సంఘం సభ్యుడు అకౌంట్ ఓపెన్ చేయాలా.

! ఈకేవైసీ చేసే సందర్భంలో ప్రతి సహకార సంఘం సభ్యుడు అకౌంట్ ఓపెన్ చేయాలి. అలా అకౌంట్ ఓపెన్ చేసినప్పుడు ప్రభుత్వ పథకాల లబ్ధి, రుణాలు అకౌంట్ ద్వారానే లభిస్తాయి.

? సహకార సంఘాల కంప్యూటరీకరణ ఎంత వరకు వచ్చింది. దీని వలన ప్రయోజనాలు ఏమిటి.

! సహకార సంఘాల డిజిటలైజేషన్ ప్రక్రియ జిల్లాలోని 78 సహకార సంఘాలలో చివరి దశకు వచ్చింది. ఆస్తి రికార్డులు, సభ్యుల వివరాల కంప్యూటరీకరణ చివరి దశకు చేరుకుంది. కంప్యూటరీకరణ వలన ప్రభుత్వ పథకాల సేవలు సభ్యులకు అందుతాయి. జవాబుదారి తనం ఉంటుంది. రుణాలు పారదర్శకంగా అందుతాయి.

- నెల్లూరు (హరనాథపురం)

మాజీ ముఖ్యమంత్రిని కలిసిన మందపాటి

కొడవలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోమవారం నెల్లూరులో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తనకు రెండుసార్లు గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పనిచేసే అవకాశం కల్పించారని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మందపాటి రమణారెడ్డి ఉన్నారు.



నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

భూగర్భ జలాలను కాపాడుకోవాలి

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముత్తుకూరు మండలంలో పరిశ్రమలు అధికంగా రావడంతో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటుతున్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సభ్యుడు శ్రీరాములు వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముత్తుకూరు మండలంలో ప్రస్తుతం 70 అడుగులు తవ్వినా నీరు రావడంలేదన్నారు. బోర్ల ద్వారా ప్రైవేటు వ్యక్తులు నీటిని తోడేసి పరిశ్రమలకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. ఈ సమాచారాన్ని అధికారులకు అందిస్తామన్నారు. సమావేశంలో ముత్తుకూరు మండల వాసులు వేణుగోపాల్, కే.నాగయ్య, జయరాం. ముంగర మస్తాన్, మధు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై ఉక్కుపాదం



● పంచాయతీల్లో కొన్నసాగుతున్న సస్పెన్షన్లు, చెక్ పవర్ రద్దు

● హడలిపోతున్న గ్రామ కార్యదర్శులు

నెల్లూరు(జడ్పీ), జనవరి 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన అవినీతి, అక్రమాల పాపాలు ప్రస్తుత అధికారులను, ఉద్యోగులను వెంటాడుతున్నాయి. జిల్లా పంచాయతీశాఖలో ఇష్టానుసరంగా వ్యవహరిస్తూ నిధులు దుర్వినియోగం చేసిన వారిపై సస్పెన్షన్ వేటు పడుతున్నది. అభివృద్ధికి సహకరించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సర్పంచుల చెక్‌పవర్‌ను అధికారులు రద్దు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీలు అధికంగా వైసీపీ సానుభూతిపరులకే ఉండడంతో వారిలో కొంత మంది సర్పంచులు వారి ఇష్టానుసరంగా వ్యవహరిస్తూ వచ్చారు. అలాగే కొంత మంది గ్రామ కార్యదర్శులు సైతం వైసీపీ కార్యకర్తలుగా మారి అక్రమాలు, అవినీతికి తెరలేపారు. గత అధికారపార్టీ నేతలు చెప్పిందే వేదంగా అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వ అక్రమాలపై ఉక్కుపాదం మోపింది.

● కొనసాగుతున్న విచారణలు

జిల్లాలోని పంచాయతీల్లో సర్పంచులు, కార్యదర్శులు పాల్పడిన అవినీతి, అక్రమాలపై పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పంచాయతీ శాఖ ఉన్నతాధికారులు విచారణప్రారంభించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఏడుగురు కార్యదర్శు లపై సస్పెన్షన్ వేటు పడింది. 8 మంది సర్పంచులకు చెక్ పవర్ రద్దు చేశారు. ఈ వ్యవహారం ఇంతటితో ఆగలేదు. జిల్లాలోని మరో 8 పంచాయతీలపై ఫిర్యాదులు రావడంతో వాటిపైనా విచారణ కొనసాగుతుంది. అక్రమాలు జరిగినట్లు తేలితే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులపై చర్యలు తీసుకోనున్నారు.

● గ్రామ కార్యదర్శుల్లో గుబులు

గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన గ్రామ కార్యదర్శుల్లో గుబులు రేగింది.కూటమి ప్రభుత్వం గత అక్రమాలపై సీరియస్‌గా వ్యవహరిస్తుండడంతో ఇంకా ఎంతమందిపై వేటు పడుతుందన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. దీంతో కూటమి ప్రభుత్వ పాలకులను ప్రసన్నం చేసుకొని, తమపై విచారణ జరగకుండా ఉండేలా చూసుకునేందుకు కార్యదర్శులు నానా తంటాలు పడుతున్నారు.

అబ్దుల్ అజీజ్ నివాసానికి పుదుచ్చేరి సీఎం



పుదుచ్చేరి సీఎం రంగస్వామికి స్వాగతం పలుకుతున్న అబ్దుల్‌అజీజ్

నెల్లూరు (వైద్యం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పుదుచ్చేరి సీఎం రంగస్వామి సోమవారం ఉదయం నగరంలోని వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా అజీజ్ ఆయన్ను శాలువా, బోకేతో సన్మానించారు. అనంతరం రంగస్వామి మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు మంచి పరిపాలనాదక్షుడని పేర్కొన్నారు. అజీజ్ మాట్లాడుతూ రంగస్వామికి తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందన్నారు. యానాంకు వెళ్తూ తననివాసానికి ఆయన వచ్చారన్నారు. అజీజ్ సోదరుడు జలీల్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నేత గిరిధర్ రెడ్డి కూడా పుదుచ్చేరి సీఎం రంగస్వామిని కలిసి, సత్కరించారు.

● అజీజ్‌తో ఎంపీ హుస్సేని భేటీ

అలాగే దుబోరి ఎంపీ రఫీబుల్లా హుస్సేన్ అజీజ్‌తో భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ దేశంలోనే 10 లక్షల మెజారిటీతో గెలిచిన ఏకైక ఎంపీ రఫీబుల్లా హుస్సేనినేనన్నారు. పార్టీలు వేరైనా ఆయన తనకు సోదడితో సమానమన్నారు.

నేత్రదానం

నెల్లూరు (వైద్యం) : కొండాయపాళెం హరిజనవాడలో సోమవారం జరిగిన దాడిలో మృతిచెందిన గంటా అభిషేక్ (21) మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యుల సమ్మతితో నేత్రదానం చేశారు. జీజీహెచ్ టెక్నీషియన్ సునీల్ నేత్రాలను సేకరించారు.

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

రాపూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం అని ఎంపీడీవో భవానీ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం జరిగిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశానికి ఎంపీడీవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో సిబ్బంది, కొన్ని పరికరాల కొరత ఉందని, ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ వి సరస్వతి, డాక్టర్ నర్మదా, డాక్టర్ హరీష్, రాపూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మీ, రాపూరు పట్టణ టీడీపీ నాయకులు, గజరా వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణను విస్మరించరాదు : సోమిరెడ్డి



పీఎంపీ అసోసియేషన్ నేతలతో కలిసి కరపత్రం విడుదల చేస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతిని, పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ఎప్పుడూ విస్మరించరాదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం వేదాయపాళెం లోని తన కార్యాలయంలో పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్, బ్లాక్ బోర్డు మిత్రమండలి సంయుక్తంగా రూపొందించిన పర్యావరణ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ సాంప్రదాయాల పరిరక్షణే పండుగల పరమార్థం అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవటం అందరి బాధ్యతని చెప్పారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ శ్యాంప్రసాద్ శశాంక తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్‌బోర్డు మిత్ర మండలి అధ్యక్షుడు ఎన్ ప్రసాద్, ఆర్ఎంపీ జిల్లా అధ్యక్షుడు కోలా రవీంద్రబాబు, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఎస్ వేణుగోపాల్, సభ్యులు గోరంట్ల శేషయ్య, మహ్మద్ గౌస్, రామరాఘవయ్య, గౌష్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని భవనాలు వెంటనే తొలగిస్తాం : కమిషనర్

నెల్లూరు(సిటీ),జనవరి 6,(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే వాటిని వెంటనే తొలగిస్తామని కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లా డుతూ భవనాలు నిర్మించుకునే వారు కచ్చితంగా ఎన్ఎంసీ నుంచి అనుమతులు పొందాలన్నారు. భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకుంటే అన్నీ పత్రాలు సక్రమమని తేలితే, 24 గంటల్లో అనుమతులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నగరవాసులు తమ సమస్యలను వాట్సాప్ నెంబరు 9494018118, లేదా కార్యాలయం నెంబర్లు 0861-2356777, 2316777కు తెలియచేస్తే సిబ్బంది క్షేత్రస్థాయికి వచ్చి పరిష్కరిస్తారన్నారు.

ఖాజావలికి మేయర్ పరామర్శ

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న నుడా మాజీ డైరెక్టర్ షేక్. ఖాజావలి సతీమణి గత శుక్రవారం కన్ను మూశారు. సోమవారం మేయర్ స్రవంతి, ఆమె భర్త జయవర్ధన్‌లు షేక్.ఖాజావలిని పరామర్శించి ప్రగాఢసానుభూతి తెలిపారు.

అక్రమ మైనింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు

● నెల్లూరు అటవీశాఖ రేంజర్ మాల్యాద్రి



సెంట్రల్ నర్సరీ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న రేంజర్ మాల్యాద్రి

సైదాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అటవీశాఖ భూముల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని నెల్లూరు అటవీశాఖ రేంజర్ ఎస్ మాల్యాద్రి హెచ్చరించారు. సోమవారం మండలంలోని మొలకలపూండ్ల, తూర్పుపూండ్ల, తోకలపూడి గ్రామాల్లో అటవీ భూములను పరిశీలించారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న సెంట్రల్ నర్సరీ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్లు రవిశేఖర్, గిరిజా కుమారి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సేవల్లో ఆర్యవైశ్యులు ముందుంటారు : నుడా చైర్మన్



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నుడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సేవల్లో ఆర్యవైశ్యులు ముందుంటారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆర్యవైశ్యులు ముందుకొచ్చి అండగా నిలిచారన్నారు. ఆర్యవైశ్యులను ఎవరైనా ఇబ్బంది పెడితే, వారికి అండగా ముందుంటానని తెలిపారు. అనంతరం 500 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘం నాయకులు కొండా ప్రవీణ్ శంకర్, పేగు షణ్ముఖరావు, కన్యకాపరమేశ్వరి ఆలయం చైర్మన్ కోట గురుబ్రహ్మం, గౌరవ సలహాదారులు ఎంపీ ఆంజనేయులు, గాదంశెట్టి హేమంత్, తులసి, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఖాదర్‌వలి

ఇందుకూరుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి తనిఖీ చేసి పలు రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, డీపీఎం విజయకుమర్, హెచ్‌ఈవో శ్రీనివాసరావు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్‌లు రమా, సతీష్‌బాబు, హెచ్ఎం మస్తాన్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వెంకటశేషయ్యపై అక్రమంగా కేసు బనాయింపు : కాకాణి

నెల్లూరు(క్రైం), జనవరి 6 (ఆంధ్ర జ్యోతి): వెంకటాచలం మాజీ జడ్పీటీసీ వెంకటశేషయ్యపై అక్రమంగా కేసు బనాయించారని, ఈ విషయమై పూ ర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ వెంకట శేషయ్య రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదుగుతున్నాడన్న కక్షతో ఎమ్మెల్యే సోమిరెడ్డి అక్రమంగా కేసు పెట్టించి జైలుకు పంపారన్నారు. ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాలన్నీ పోలీసు అధికారులకు అందించామన్నారు. వారు విచారణ చేస్తారో... లేదో ? వేచి చూడాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పారా అథ్లెట్ భవానికి ఆర్థిక చేయూత



చెక్కు అందుకున్న క్రీడాకారిణి భవాని

నెల్లూరు(విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకి చెందిన అంతర్జాతీయ పారాఅథ్లెట్ భవానికి శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు చొరవతో ఎన్ఆర్ఐ సెల్ ఆర్థిక చేయూతనందించింది. భవాని ఆర్థిక ఇబ్బందులను శాప్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన ఆమెకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని ఎన్ఆర్ఐ సెల్‌ను కోరారు. ఎన్ఆర్ఐ సెల్ స్పందిస్తూ తక్షణసాయంగా లక్ష రూపా యలు అందచేశారు. సోమవారం క్రీడాకారిణికి ఎన్ఆర్ఐ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎన్ఆర్ఐ సెల్ కోఆర్డినేటర్ రాజశేఖర్, దాత లగడపాటి సుబ్బారావు ఆమెకు చెక్కును అందచేశారు. దీంతో భవాని శాప్ చైర్మన్‌కు, నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా మాకాని తాతయ్య ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట గురునిలయంలో సోమవారం మాకాని తాతయ్య ఆరాధన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తాతయ్య విగ్రహానికి అభిషేకాలు, హోమ గుండం పూజ, భజనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో హైకోర్టు సీనియర్ న్యాయవాది చంద్ర, మాజీ వైద్యాధికారి సాంబశివరావు, పెంచలయ్య, మాకాని భక్త బృందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా హాజరయ్యారు.

రూరల్లో సమస్యలు పరిష్కరించాలి : కోటంరెడ్డి సోదరులు



కమిషనర్‌తో భేటీ అయిన కోటంరెడ్డి సోదరులు

నెల్లూరురూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని మున్సిపల్ డివిజన్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి కోరారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజతో వారు భేటీ అయ్యారు. వారు మాట్లాడుతూ రూరల్లో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త తరలింపు వాహనాల సంఖ్యను పెంచాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్లు, డ్రైన్లను త్వరితగతిన పరిష్కరిం చేందుకు నిధులు కేటాయింపు జరపాలని విజ్ఞప్తి చేశారు. వీధిలైట్లు, దోమల నివారణ పైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ భేటీలో మాజీ మేయర్ భానుశ్రీ పాల్గొన్నారు. కాగా కమిషనర్‌ను కలిసిన టీడీపీ నేత భువనేశ్వరప్రసాద్ టిడ్కో గృహాల లబ్ధిదారులకు ఈఎంఐల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

గుంతల రహితంగా నెల్లూరు రూరల్

నెల్లూరురూరల్,జనవరి 6,(ఆంధ్రజ్యోతి): రోడ్లపై గుంతల్లేకుండా నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నట్లు రూర ల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం 36వడివిజన్ పత్తేఖాన్‌పేట మొయిన్ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ తన నియోజకవర్గంలో రోడ్లు ఆధునీకరణ, నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలో గుంతలు లేని రహదారులను ప్రజలు చూస్తారని తెలిపారు. అనంతరం స్థానిక డివిజన్ టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పిండి శాంతిశ్రీ, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ, పిండిసురేష్, సురేంద్రబాబు, ఆనంద్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నెల్లూరు (వైద్యం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నర్తకి సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు కమిషనర్ సూర్యతేజను కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు ఆయన వినతిపత్రం అందించారు. అలాగే బోడిగాడితోట శ్మశానవాటికలో చనిపోయిన వారిని కాల్చేందుకు ప్రతిరోజూ ఎంతోమంది వస్తుంటారన్నారు. అక్కడ అనేక రకాల వ్యర్థాలు వేస్తున్నారని, వాటిని వెంటనే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు డాక్టర్ గణేష్‌కుమార్, ఎనికిపాడు చెంగయ్య, కలవకుంట భాస్కర్, సిద్ద కళాచారి, అర్కాట్ కృష్ణ, కవిత, కంచి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలు నిర్మించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 6(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ముంపువాసుల పునరావాస కేంద్రాలను నిర్మించాలని నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. సోమవారం ఆయన తెలుగుగంగ పర్యవేక్షణ ఇంజనీర్ రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందచేశారు. నగరంలోని తెలుగుగంగ ప్రాజెక్టు కార్యాలయంలో పర్యవేక్షణ ఇంజనీర్‌ను బీజేపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సోమశిల నుంచి కండలేరుకు నీటిని తీసుకువచ్చే వరద కాలువను 12వేల క్యూసెక్కుల నుంచి 24 వేల క్యూసెక్కులకు విస్తరించేందుకు పనులు ప్రారంభించి అర్ధంతరంగా నిలిపివేశారని తెలిపారు. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరాల సుబ్బారెడ్డి, నీలిశెట్టి లక్ష్మణరావు, నారాయణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పడుగుపాడు వాసికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

కోవూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పడుగుపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గంగవరపు తమ్మినాయుడు సోమవారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నుంచి టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. ఇటీవల స్థానిక టీడీపీ నాయకులు జెట్టి మదన్‌రెడ్డి, నజీర్ టీడీపీ శాశ్వత సభ్యత్వానికి దరఖాస్తు చేసుకోమని ఆయనను కోరారు. ఆ మేరకు రూ.లక్ష చెల్లించి దరఖాస్తు చేసుకోగా టీడీపీ కేంద్ర కమిటీ దరఖాస్తును పరిశీలించి సభ్యత్వాన్ని కేటాయించింది. ఈక్రమంలో శాశ్వత సభ్యత్వాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నుంచి ఆయన అందుకున్నారు. ఆయనను పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

కోసూరు రత్నంకు ఎలైట్ బ్రాండ్ అవార్డు ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాలాక్షి వృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు కోసూరు రత్నంకు తెలంగాణ ఎలైట్ బ్రాండ్ అవార్డు ప్రదానం చేశారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ మాదాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆయన బహూకరించారు. గొలగమూడిలో 120 మంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ నిరంతరం సేవ చేస్తున్న వీరి కార్యక్రమాలు సంస్థ దృష్టిని ఆకర్షించడంతో ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీలో జిల్లాకు బంగారు పతకం

నెల్లూరు(విద్య), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని జైపూర్ పూర్ణియ యూనివర్సిటీలో ఈనెల 3 నుంచి 5 వరకు జరిగిన 41వ సబ్‌జూనియర్ జాతీయ ఆర్చరీ పోటీల మిక్స్‌డ్ విభాగంలో జిల్లా క్రీడాకారులు బంగారు పతకం సాధించారు. జిల్లాకు చెందిన ఆర్.సాయిమౌర్య, కృష్ణాజిల్లాకి చెందిన యుక్తాశ్రీలు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పాల్గొని ఫైనల్స్‌లో రాజస్థాన్ క్రీడాకారులపై విజయం సాధించి బంగారు పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సాయిమౌర్యను జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లంరెడ్డి శ్రీహర్ష, కార్యదర్శి పావురాల వేణు, కోచ్ టీ శివశంకర్ సోమవారం అభినందించారు.

న్యూస్ బాక్స్

ఎరువుల వాడకంపై అవగాహన

వెంకటాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటేపల్లి, గొలగమూడి, అనికేపల్లి, తిక్కవరప్పాడు, కసుపూరు గ్రామాల్లో సోమవారం రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ, పరిశోధన కేంద్రం అధికారులు పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. అనంతరం వరి పంట సాగులో మెలకువలు, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్ శ్రీనివాసులు, వ్యవసాయ శిక్షణ కేంద్రం అధికారి సీ మారుతిదేవి, శాస్త్రవేత్త పరమశివం, మండల వ్యవసాయ శాఖాధికారి డీ హరికరుణాకర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు అభిషేక్, ప్రత్యూష, సందాని బాషా తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుకు షోకాజ్ నోటీసు

కొడవలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రేగడిచెలిక పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని, నిబంధలనకు విరుద్ధంగా మూడో వ్యక్తికి చెల్లించారని జిల్లా కలెక్టర్‌కు చెముకుల భాస్కర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీరాజ్ అధికారి వివరణ కోరుతూ సోమవారం రేగడిచెలిక పంచాయతీ సర్పంచుకు షోకాజ్ నోటీసు అందించారు. వారం రోజుల లోపు సంబంధిత పత్రాలు అందించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులో పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

వెంకటాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సరస్వతి నగర్ వద్ద ఉన్న రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు నాయుడుపేటలో జరిగిన అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో తమ సత్తాచాటారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముని లోకేష్ 1500 మీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానం, వెంకటసాయి 400 మీటర్ల పరుగుపందెంలో తృతీయస్థానంలో నిలిచారు. దీంతో సోమవారం ఇద్దరిని రవీంద్ర భారతి పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ మహేష్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంగటి నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు సాయికుమార్, మహేష్, సాయిచరణ్, ఉదయ్ తదితరులు న్నారు.

ఫిష్‌కాన్ అధ్యక్షుడిగా 'భక్తాని'

కోవూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫిష్‌కాన్ స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడిగా విడవలూరు మండలం రామచంద్రాపురం పంచాయతీ లక్ష్మీపురంకు చెందిన భక్తాని శ్రీనివాసులును ఏపీ ఫిష్‌కాన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌జీ లీ దాస్ సూచనలతో డైరెక్టర్ ప్రళయకావేరి వేణుగోపాల్ సోమవారం నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను పలువురు మత్స్యకార నాయకులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘం ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్


కోవూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమ స్యల పరిష్కారం కోసం కోవూరు డివిజన్ తెలుగునాడు విద్యుత్తు కార్మిక సంఘాన్ని ఏ ర్పాటు చేస్తున్నట్లు డిస్కమ్ రీజనల్ కార్యదర్శి ఎం రమేష్ తెలిపారు. స్థానిక బుద్ధి పద్మా వతి కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన సమావేశంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీకి గౌరవాధ్యక్షుడిగా పులి సురేష్‌బాబు, అధ్యక్షుడిగా ఎస్కే. సుభాన్, కార్యదర్శిగా కేవీఎల్వీ ప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రీజనల్ కమిటీ అధ్యక్షుడు ఎస్ ఏవీ ప్రసాద్, అడ్వైజర్ ఎన్ఏ కుమార్ పాల్గొన్నారు.

శివాలయం హుండీ లెక్కింపు

పొదలకూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాతన శివాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం హుండీల లెక్కింపు జరిగింది. 9 నెలలకు భక్తులు సమర్పించిన కానుల ద్వారా రూ.1,28,334 ఆదాయం వచ్చినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్ స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్, అర్చకుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

నెల్లూరు(విద్య), జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం డైరీని రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీవీ. నరసింహమూర్తి సోమవారం ఆవిష్కరించారు. నగరంలోని మూలాపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా, ఉపా ధ్యాయ పూర్తిసమాచారంతో డైరీని రూపొందించామని, ఇది ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తిరుపాల్, జిల్లా అధ్యక్షుడు మస్తాన్, విశ్రాంత ఎంఈవోలు కేఎస్.నరసయ్య, సీహెచ్.రమేష్‌బాబు, నేతలు ఎంవీ. జానకీరామ్, వెంకటేశ్వర నాయక్, ప్రధానోపాధ్యాయులు పార్థసారథి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 7 జనవరి 2025

18,04,229

- ఇదీ జిల్లా ఓటర్ల లెక్క
- మహిళలు 9,25,735, పురుషులు 8,78,321
- అత్యధికంగా చంద్రగిరిలో 3,14,230
- గతేడాదితో పోల్చితే తగ్గిన 8,751 మంది

తిరుపతి (కలెక్టరేట్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుది ఓటర్ల జాబితాను కలెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం విడుదల చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 18,04,229 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఎప్పటిలాగే మహిళా ఓటర్లే అధి



కారంగా ఉన్నారు. వీరి సంఖ్య 9,25,735. పురుషులు 8,78,321 మంది ఉన్నారు. 47,414 మంది మహిళలే ఎక్కువ. ట్రాన్స్‌జెండర్స్ 173 మంది ఉన్నారు. మొత్తం 2,141 పోలింగ్ కేంద్రాల పరిధిలో 18,04,229 మంది ఓటర్లుగా చేరింది. ఇక సర్వీసు ఓటర్లు 823మంది ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏప్రిల్ 26నాటికి అప్పటి జిల్లా యంత్రాంగం ప్రకటించిన ఓటర్ల సంఖ్య 18,12,980. గతేడాదితో పోలిస్తే ఇప్పుడు 8,751మంది ఓటర్లు తగ్గారు. ఒక్క తిరుపతి నియోజకవర్గంలోనే సుమారు 6 వేల ఓటర్లు తగ్గడం విశేషం. గూడూరు, చంద్రగిరిలో వెయ్యేసి.. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడులో సుమారు 800 ఓట్లు చొప్పున తగ్గాయి. గతేడాది ఎన్నికల ముందు దొంగ ఓట్లు భారీగా చేర్పించారని అప్పట్లో టీడీపీ నేతలు అధికారులకు పదే పదే ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అప్పటి యంత్రాంగం పట్టించుకోకపోవడంతో దొంగ ఓట్లు చేరాయని వీరు ఆరోపించారు. ఇప్పుడు ఆ దొంగ ఓట్లు తగ్గాయని అంటున్నారు.

ఆగస్టు నుంచి ఓటర్ల జాబితా సవరణ

జిల్లాలో ఆగస్టు 20 నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ మొదలైంది. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల సమాచారాన్ని ధ్రువీకరించారు. గతంలో జరిగిన పొరపాట్లను గుర్తించారు. డెత్, షిఫ్టింగ్ ఓటర్లను తొలగించారు. ఓటర్ల అభ్యంతరాలను స్వీకరించారు. సాధ్యమైనంత వరకు దొంగ ఓట్లను తొలగించారు. కాగా, కొత్తగా సుమారు 4వేల మంది ఓటర్లు నమోదుకాగా, అందులో 18 ఏళ్ల వారు 1300 మంది ఉన్నారు.

ప్రస్తుతం జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్య

అసెంబ్లీ నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
గూడూరు	294	1,18,874	1,25,917	34	2,44,825
సూళ్ళూరుపేట	304	1,17,658	1,24,170	20	2,41,848
వెంకటగిరి	298	1,19,088	1,24,908	4	2,44,000
చంద్రగిరి	398	1,52,510	1,61,661	59	3,14,230
తిరుపతి	274	1,46,486	1,50,013	32	2,96,531
శ్రీకాళహస్తి	294	1,19,629	1,28,306	13	2,47,948
సత్యవేడు	279	1,04,076	1,10,760	11	2,14,847
మొత్తం	2,141	8,78,321	9,25,735	173	18,04,229



తిరుపతి సబ్ జైలులోకీ గంజాయి!

వాయిదాలకు వచ్చినప్పుడు పొడి రూపంలో తీసుకెళుతున్న రిమాండ్ ఖైదీలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సబ్‌జైలులోకీ గంజాయి చేరుతోంది. వాయిదాలకు వచ్చే సమయంలో అధికారుల కళ్లుగప్పి రిమాండ్ ఖైదీలు తీసుకెళుతున్న ఘటనలున్నాయి. విశాఖ సబ్ జైలులో గంజాయి కలకలం రేగిన నేపథ్యంలో తిరుపతి సబ్ జైలులోనూ అటు ఇటుగా గంజాయి చేరుతున్నట్లు తెలిసింది. ఇక్కడి సబ్ జైలు సామర్థ్యం దాదాపు 120 మందికే. కానీ, ప్రస్తుతం 140 మంది వరకున్నారు. వీరిలో కనీసం 20 నుంచి 30 మంది గంజాయితో పాటు వివిధ రకాల మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారున్నట్లు తెలిసింది. వీరిలో కొందరిని వాయిదాల కోసం ప్రత్యేక ఎస్కార్టుతో ఇతర జిల్లాల్లోని న్యాయస్థానాలకు తీసుకెళ్లి హాజరుపరుస్తుంటారు. అక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్న సమయంలో వారి స్నేహితులు, బంధువులు కొందరు వీరితో మాట్లాడేందుకు వస్తుంటారు. ఆ సమయంలో రిజర్వు కానిస్టేబుళ్ల కళ్లుగప్పి గంజాయి పొడిని రిమాండు ఖైదీలకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్యాకెట్లను గుట్టుచప్పుడు కాకుండా వీరు బ్యారక్‌లకు తీసుకెళుతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. రాత్రిళ్లు వీరు గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారం. ఇక, రిమాండ్ ఖైదీలకు గంజాయి సరఫరా చేయడానికి ప్రత్యేకంగా కొన్ని బ్యాచ్‌లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీళ్ల ఇక్కడికి తీసుకొచ్చి చేరిస్తే రూ.వెయ్యి ముట్టచెపుతున్నట్లు సమాచారం. తరచూ అధికారులు తనిఖీ చేసి కొన్ని ప్యాకెట్లను గుర్తించి పడేస్తున్నా.. ఇంకొన్ని కనపడకుండా రిమాండ్ ఖైదీలు జాగ్రత్త పడుతున్నారు. నెలలో ఐదు నుంచి 10 మంది నుంచి గంజాయి పొడి ప్యాకెట్లు తీసి బయట పడేస్తున్నా.. వారిలో మార్పు రాకపోవడం గమనార్హం. కాగా, రాత్రిళ్లు కొందరు బయట నుంచి.. కొన్ని ఇళ్లపైకి వెళ్లి సబ్‌జైలులోకి గంజాయి పొడి ప్యాకెట్లు విసురుతున్నట్లు సిబ్బంది గుర్తించినట్లు తెలిసింది. ఏమాత్రం అదమరిచినా ప్యాకెట్లు లోపల పడిపోతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇలా బీడీలను లోపలకు విసిరిన సందర్భాలున్నాయి. వీటిపై ఉన్నత స్థాయి అధ్యయనం చేసి సబ్‌జైలు లోపలకు గంజాయి రాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పాత ఖైదీల పాత్ర ఎక్కువ



సబ్‌జైలులో ఉంటున్న పాత ఖైదీలు కొందరు గంజాయి పొడి ప్యాకెట్లు లోపలకు తీసుకొస్తున్నారు. వాయిదాలకు వెళ్ళి అక్కడ నుంచి ఎస్కార్టు కళ్ళు కప్పి ఏదో ఒక మార్గంలో గంజాయి పొడి తీసుకుంటున్నారు. ఎవరికీ కనిపించని ప్రాంతంలో పెట్టుకుని వస్తున్నారు. వీరిలో ఇప్పటికీ ఒకరిద్దరు ఉన్నారు. బయట వాయిదాలకు వెళ్ళి జైలులోకి వచ్చే సమయంలో తనిఖీ చేసిన సమయంలో దొరికితే మాత్రం తీసి పడేస్తున్నాం. ఇకపై ఖైదీలను గట్టిగా తనిఖీచేసి లోపలకు ఎట్టి పరిస్థితుల్లోనూ గంజాయి ప్యాకెట్లు తీసుకెళ్లకుండా కట్టడి చేస్తాం.

- గురుశేఖర్‌రెడ్డి, తిరుపతి సబ్ జైలు పర్యవేక్షణాధికారి

ఎలా ఉన్నారు? జాగ్రత్త!

చెన్నై, బెంగళూరుల్లో హెచ్‌ఎంపీవీ కేసుల నమోదుతో బంధువుల ఆందోళన

సూళ్లూరుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై, బెంగళూరులో ఇద్దరు చొప్పున నలుగురు చిన్నారులకు హెచ్‌ఎంపీవీ వైరస్ సోకడంతో సూళ్లూరుపేటలో ఆందోళన మొదలైంది. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ విభాగంలో ఈ ప్రాంతం వారు ఎక్కువ మంది ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు వారికి ఫోన్లు చేసి జాగ్రత్తలు చెబుతున్నారు. చెన్నైలోనూ ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది వెళ్లి సెటిల్ కావడం.. వ్యాపార పరంగా ప్రతి అవసరానికీ అక్కడి వెళ్తుండటం.. ఈ క్రమంలోనూ ఆందోళన నెలకొంది. కొందరూ అధికారులు, పాఠశాలల నిర్వాహకులు మంగళవారం నుంచి మాస్కులు ధరించి రావాలని ముందుజాగ్రత్త చర్యగా చెప్పడం గమనార్హం. ఈ వైరస్ ప్రభావం పక్షుల పండుగపై పడుతోందన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. చిన్నారులపై దీని ప్రభావం ఎక్కువగా చూపే ప్రభావం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ వైరస్ సోకిన వారికి దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడంతో పాటు శ్వాస తీసుకోవడం ఇబ్బంది ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను ముందుగానే కొనుక్కొని వైద్య నిపుణుల సలహా మేరకు వైద్యం చేయించుకోవాలి. కరోనా లాగా ఇది వ్యాప్తి చెందకపోయినా అప్రమత్తంగా ఉంటే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

సీఎస్ తహసీల్దారట!



సూళ్లూరుపేట డివిజన్‌కు చెందిన ఆ అధికారి డిప్యూటీ తహసీల్దారు మాత్రమే. కానీ కారులో ఇలా సివిల్ సప్లయస్ తహసీల్దారుగా బోర్డు పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తుంటారు. తహసీల్దార్లకు టోల్ ప్లాజాలో రుసుం మినహాయింపు ఉంది. ఇలా టోల్ ఫీజు చెల్లించకుండా ఉండేందుకు ఈయనతోపాటు కొందరు ఇలాంటి బోర్డులను ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అసలు, సివిల్ సప్లయస్‌లో మండలస్థాయిలో డిప్యూటీ తహసీల్దార్లే ఉంటారు. జిల్లాలోనూ సీఎస్ తహసీల్దారు పోస్టే ఉండకపోవడం గమనార్హం. దీనిపై ఇటీవల టోల్‌ప్లాజాలో ప్రశ్నించినట్లు తెలిసింది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

అన్‌స్టాపబుల్ కుప్పం!

మోడల్ నియోజకవర్గంగా సర్వతోముఖాభివృద్ధి



- రాష్ట్రానికి ముఖ్యమంత్రిని కానీ, మీకు ఎమ్మెల్యేనే
- స్వర్ణకుప్పం విజన్- 2029 ఆవిష్కరణలో సీఎం
- నడిమూరులో సోలరైజేషన్ పథకం ప్రారంభం
- నెట్ జీరో కాన్సెప్ట్‌పై కాన్పూర్ ఐఐటీతో ఒప్పందం



చంద్రబాబుపై వెల్లువెత్తిన అభిమానం

కుప్పం/గుడుపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'కుప్పం అభివృద్ధిని ఇక ఎవరూ ఆపలేరు. అన్‌స్టాబుల్‌గా అభివృద్ధి చేసి చూపిస్తా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. 'రాష్ట్రానికి ముఖ్యమంత్రిని కానీ, ముందుగా మీకు ఎమ్మెల్యేని. అందుకే కుప్పం సర్వతోముఖాభివృద్ధి నా బాధ్యత. మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్ది, రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతా' అన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో మొదటి రోజైన సోమవారం కుప్పం, గుడుపల్లె మండలాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత ద్రావిడ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో స్వర్ణకుప్పం విజన్- 2029 ఆవిష్కరించారు. ఇక్కడ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విజన్ డాక్యుమెంట్‌తో కుప్పం భవిష్య అభివృద్ధిని వివరించారు. విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. అనంతరం కుప్పం మండలం నడిమూరులో పీఎం సూర్యఘర్ పథకం కింద సోలరైజేషన్ కార్యక్రమం ప్రారంభించి వేదికనుంచి ప్రసంగించారు. అంతకుముందు ఆయన నెట్ జీరో కాన్సెప్ట్‌పై కాన్పూర్ ఐఐటీతో ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత మండలంలోని శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయ రైతులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ గత అయిదేళ్ల విధ్వంస పాలనలో కుప్పం అభివృద్ధి పూర్తిగా నిలిచిపోవడమే కాక, పదేళ్ల వెనక్కి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రెట్టించిన వేగంతో కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి స్వర్ణ కుప్పం విజన్‌తో ముందుకు వచ్చానన్నారు.గత పాలకులు కక్షపూరితంగా అభివృద్ధిని అడ్డుకోవడమే కాక, టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులపాలు చేశారన్నారు. అయితే ఇక ఎవరూ కుప్పం అభివృద్ధిని ఆపలేరని,అది అలా అన్‌స్టాపబుల్‌గా ముందుకు సాగుతూనే ఉంటుందని ప్రకటించారు. 2024లో అధికారంలోకి వచ్చాక ఒకసారి కుప్పం వచ్చి వెళ్లానని గుర్తు చేసుకున్న చంద్రబాబు, అప్పుడు ప్రజలకు హామీ ఇచ్చినట్లుగా కడా ఏర్పాటు చేసి, తద్వారా అభివృద్ధికి శ్రీకారం చుట్టానన్నారు. పేదరికంలేని సమాజాన్ని ఇక్కడ సృష్టిస్తానని, ప్రతి కుటుంబమూ ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన ప్రణాళికలు అమలుపరుస్తానని చెప్పారు. పెద్దయెత్తున పరిశ్రమలు స్థాపించి 15 వేల ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. ఇందుకు నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ముఖ్యంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా వారి స్వావలంబనకు చర్యలు తీసుకుంటానన్నారు.

జూన్‌కల్లా హంద్రీ-నీవా జలాలు

హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్‌ను జూన్ నెలకల్లా పూర్తి చేసి నియోజకవర్గానికి సాగు, తాగునీటి వనరులు పుష్కలంగా అందేలా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. హంద్రీ-నీవా జలాలను పాలారు నదికి తీసుకొస్తానన్నారు. ఈ నదిపై చెక్‌డ్యామ్‌లు మరిన్ని నిర్మించి నీటిని నిల్వ చేసి కుప్పంలో బంగారు పంటలు పండించేలా చూస్తానన్నారు. వ్యవసాయాన్ని కూడా అత్యాధునిక సాంకేతికత వినియోగంతో లాభసాటిగా మారుస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో డీప్ టెక్నాలజీదే హవా అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ మానసపుత్రిక అయిన ద్రావిడ విశ్వవిద్యాలయం వైసీపీ రాజకీయానికి బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రావిడ వర్శిటీతో పాటు ఇతర వర్శిటీల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టి, అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తానన్నారు. నెట్ జీరో కుప్పం ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు.



నడిమూరులో చంద్రబాబుతో విక్టరీ సంకేతాన్ని చూపిస్తున్న చిన్నారి

సోలరైజేషన్ ఒక చరిత్ర

నడిమూరులో సోలరైజేషన్ కార్యక్రమం ప్రారంభించడం ఒక చరిత్రని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోనే తొలుత ఈ పథకాన్ని ప్రారంభించిన నడిమూరు చరిత్రలో మిగిలిపోతుందన్నారు. నెట్ జీరో కాన్సెప్ట్‌కు సంబంధించి కాన్పూర్ ఐఐటీతో కుదిరిన ఒప్పందంతో కాలుష్య రహిత కుప్పాన్ని నిర్మిస్తామని, ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సైకిళ్ల వంటివాటి ద్వారా కర్బన ఉద్గారాలను అరికడతామని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, కోనేటి ఆదిమూలం, గురజాల జగన్మోహన్, డాక్టర్ థామస్, మురళీమోహన్, టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్, ఎస్పీడీసీఎల్ అధికారులు, రెస్కో ఎండీ సోమశేఖర్‌తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం.. ఆదాయం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సమాజం రూపొందుతుందని, రైతుకు ఆదాయం సమకూరుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయదారులతో సాయంత్రం ఆయన ముఖాముఖిలో పాల్గొన్నారు. ప్రకృతి ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నందున మార్కెటింగ్ బాగా జరుగుతుందని, అధిక లాభాలు ఆర్జించవచ్చన్నారు. 100 రూకార్ట్ సబ్జీ కూలర్లను తీసుకొస్తామని, వాటిల్లో కూరగాయలు, పండ్లు, పూలు వారంపాటు తాజాగా ఉంటాయన్నారు. వీటి పనితీరు చూశాక మరిన్ని తీసుకొస్తామని చెప్పారు.



గెలుపే లక్ష్యంగా..

తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వేదికగా 13వ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. కళాశాల క్రీడా మైదానంలో జరిగిన తొలిరోజు పోటీల్లో పలు కళాశాలల విద్యార్థులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్ పురుషుల విభాగంలో ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాలపై తిరుపతి కళాశాల జట్టు.. గరివిడిపై ఎన్టీఆర్ గన్నవరం కళాశాల జట్టు విజయం సాధించాయి. మహిళా విభాగంలో గరివిడి వెటర్నరీజట్టుపై తిరుపతి కళాశాల విజయం సాధించింది. బాస్కెట్‌బాల్ మహిళల విభాగంలో గన్నవరంపై ప్రొద్దుటూరు కళాశాల, తిరుపతి డెయిరీ టెక్నాలజీ కాలేజీపై స్థానిక వెటర్నరీ కళాశాల జట్టు విజేతగా నిలిచాయి. టెన్నికాయిట్‌లో తిరుపతి డెయిరీ టెక్నాలజీ కాలేజీపై ప్రొద్దుటూరు వెటర్నరీ కళాశాల.. గరివిడి వెటర్నరీ, తిరుపతి డెయిరీ టెక్నాలజీ జట్లపై తిరుపతి వెటర్నరీ కాలేజీ విజేతగా నిలిచింది. బాల్‌బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో ఎన్టీఆర్ వెటర్నరీపై గరివిడి వెటర్నరీ కళాశాల జట్టు గెలుపొందింది.



- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.98 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 66,561

తలనీలాలు సమర్పించినవారు: 18,647





ఒత్తిడిని చిత్తు చేద్దాం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యలు..వీటి నుంచి ఉత్పన్నమయ్యే ఒత్తిళ్లు.. ఈ రెండూ అందరికీ నిత్య జీవితంలో ఎదురవుతాయి. అందుకే ఒత్తిళ్లను అమ్మ పొత్తిళ్లు అనుకోవాలంటారు పెద్దలు.. బుర్ర నిండా బోలెడు సమస్యలు. తెల్లారిలేచింది రాత్రి పక్క చేరేదాకా ఒకటే ఒత్తిడి. కూల్‌గా ఉండలేని పరిస్థితి. పరుగులెత్తే ఆధునిక ప్రపంచంలో నిశ్చింతగా ఉండటం అంత ఈజీ కాదు. ఒక్కొక్కరిదీ ఒక్కో లక్ష్యం. చేరుకోలేక నిత్యం సతమతం. వ్యక్తిగత, కుటుంబ, సామాజిక, ఆర్థిక సమస్యలతో నిరంతరం కుస్తీ. పర్యవసానంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఇది మనసునే కాదు ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తోంది. కుంగదీస్తోంది. సమస్యను సరిగా అర్థం చేసుకోలేకపోవడం, పరిష్కారాన్ని కనుక్కోలేకపోవడం వల్ల ఒత్తిడి మరింతగా పెరుగుతుందంటారు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ గాయత్రి.. ఏ సమస్యా శాశ్వతంగా స్థిర నివాసమేర్పచుకోదని గుర్తిస్తే ఒత్తిడి పటాపంచలవుతుందంటున్నారు..ఆమె ఇంకా ఏం చెబుతున్నారంటే..



డాక్టర్ గాయత్రి అధ్యాపకురాలు, సైకాలజీ విభాగం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం



ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

సాధ్యమైనంతవరకూ ప్రతికూల మనస్తత్వాన్ని దూరం చేసుకోవాలి. సానుకూల దృక్పథాన్ని అలవరుచుకుంటే ఒత్తిడికి నేరుగా చెక్ పెట్టవచ్చు. అయిన దానికీ కాని దానికీ బూతద్దంలో చూడటం మానుకోవాలి. ఏమాత్రం తీరిక దొరికినా ఆత్మీయులతో కొన్ని షేర్ చేసుకోవాలి. కొంత భారం దిగుతుంది. మానసిక ఉల్లాసాన్ని పెంచే అభిరుచులను అలవర్చుకోవాలి. సృజనాత్మకతగా ఆలోచించినా ఉపశమనం కలుగుతుంది. పండ్లు, కూరగాయలు ఆహారంగా తీసుకోవడం ఉత్తమం. క్రమం తప్పకుండా వేళకు తిని పడుకోవాలి. రోజూ వ్యాయామం, ధ్యానం, యోగా చేయడం శ్రేయస్కరం. లేకపోతే ఒత్తిడి, రోగాలు మన కోసం సమయం కేటాయిస్తాయని గుర్తించాలి. ప్రకృతితో మమేకం కావడం. మంచి పుస్తకాలు చదవడం లాంటివి అభిరుచిగా మారితే ఒత్తిడికి గట్టిగా సమాధానం చెప్పవచ్చు. హాస్య వినోదాన్ని ఆస్వాదించాలి. మొహమాటంతో అన్నింటికీ ఎస్ అన వద్దు. చేయలేని పనులకు నో చెప్పండి. సమస్య గురించి ఎక్కువగా ఆలోచించి బుర్ర పాడుచేసుకోవడం కంటే అందులో సగం సమయం పరిష్కారం గురించి ఆలోచిస్తే ఎంతో ప్రయోజనం. మొబైల్ ఫోన్లకు అతిగా సమయం కేటాయిస్తే నిద్రకు దూరమై మానసిక,శారీరక అనారోగ్యం బారినపడతారు. మానసిక ఒత్తిడి తగ్గితే శ్వాస ప్రక్రియ కూడా సాధారణ స్థితికి చేరుకుంటుంది. అంతేకాదు హార్మోన్లూ సమతుల్యమవుతాయి. ఇక భావోద్వేగాలు మీ అదుపులో ఉంటాయి.

ఒత్తిడిని గుర్తించడం ఇలా..

తీవ్ర ఒత్తిళ్లకు లోనైప్పుడు కోపం, అసహనం, ప్రతీకారం,అభద్రత, నిరాశ, మనసులో గూడు కట్టుకుంటాయి. అపనమ్మకం పెరిగి ప్రతిదానికీ భయపడుతుంటారు. ఫలితంగా నిద్ర లేమి ఉత్పన్నమవుతుంది. దీంతో నీరసించిపోవడంతోపాటు భావోద్వేగాల నియంత్రణలో మార్పులు కనిపిస్తాయి. ఇవి బీపీ, షుగర్ వంటి సమస్యలకు కారణమవుతాయి. గుండెజబ్బులకూ దారితీస్తాయి. ఒత్తిడి దీర్ఘకాలంగా ఉంటే మతిమరుపు, డిప్రెషన్, అజీర్తి, ఆస్తమా, గుండెజబ్బులు రావచ్చు.

ముక్కంటి ఆలయంలో ముగ్గురు సెక్యూరిటీ సూపర్‌వైజర్ల తొలగింపు

● మరొకరిపై విచారణ

శ్రీకాళహస్తి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సెక్యూరిటీ విభాగంలో కొందరి తీరు అభ్యంతరకరంగా మారింది. కొంతకాలంగా విధి నిర్వహణలో వారు వ్యవహరిస్తున్న శైలిపై అధికారులు పలుమార్లు మందలించినా పద్ధతి మార్చుకోలేదు. ఫలితం.. ఒకేసారి ముగ్గురు సూపర్‌వైజర్లను విధుల నుంచి తప్పించారు. మరొకరిపై మహిళల ఫిర్యాదుతో అధికారులు గోప్యంగా విచారణ చేపట్టారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరుకు చెందిన శీనయ్య అనే సూపర్‌వైజరు మహిళా సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, ఇష్టంవచ్చినట్లు గార్డులను నియమించుకోవడం.. ఇష్టం లేని వారికి విధులు కేటాయించకుండా వేధించడంలాంటి చేసేవాడన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మూడు నెలల క్రితం ఆయన్ను కొంతకాలం విధుల నుంచి పక్కన పెట్టారు. మళ్లీ అధికారులను ప్రాధేయపడటంతో తిరిగి సూపర్‌వైజర్‌గా అవకాశం ఇచ్చారు. ఇక, శ్రీకాళహస్తి పట్టణానికి చెప్పిందిన శ్యామ్ ఆలయ రెండో గోపురం పక్కనే యూనిఫాంలో మద్యం తాగుతున్న ఫొటోలు, వీడియోలు రెండు నెలల క్రితం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అధికారులు మందలించి క్రమశిక్షణతో పనిచేయాలని కొనసాగించారు. ఇటీవల సూపర్‌వైజర్లు ఒక ప్రామాణికం లేకుండా సెక్యూరిటీ గార్డులను నియమించుకోవడం, కొందరికి విధులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసేవారు. ఆలయంలో భక్తుల నుంచి నగదు వసూలయ్యే కీలక స్థానాల్లో అనుకూలమైన వారిని నియమించుకోవడం ద్వారా ఆ నగదు వాటాలుగా పంచుకుంటున్నట్లు ఈవో బాపిరెడ్డికి ఫిర్యాదులు వచ్చాయి. దాంతో నాలుగు రోజుల పాటు విధులు కేటాయింపుపై ఈవో దృష్టి సారించారు. ప్రత్యేకంగా ఆదాయం వచ్చే చోట్ల కొందరు సూపర్‌వైజర్లకు విధులు కేటాయించి నిఘా పెట్టారు. వీరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు సీసీకెమెరాల ద్వారా పక్కా ఆధారాలతో గుర్తించారు. దీంతో ఎప్పటి నుంచో విమర్శలున్న శీనయ్య, శ్యామ్‌తో పాటు చంద్రను విధుల నుంచి తప్పుకోవాల్సిందిగా ఆదేశించారు.

విధులివ్వకుండా వేధిస్తున్నారని..

శ్రీకాళహస్తి పట్టణం వాటర్‌హౌస్ కాలనీకి చెందిన సూపర్‌వైజర్ షణ్ముగంపై సోమవారం కొందరు మహిళా సెక్యూరిటీ గార్డులు ఫిర్యాదులు చేశారు. తొట్టంబేడు మండలం కన్నలి నుంచి ఓ మహిళ గార్డు విధుల కోసం మధ్యాహ్నం ఆలయం వద్దకు వచ్చారు. ఈమెకు కాకుండా, సీనియార్టీ ప్రకారం వెనుక ఉన్న మహిళకు షణ్ముగం డ్యూటీ కేటాయించారు. ఇలా నాలుగు రోజుల నుంచి డ్యూటీ ఇవ్వకుండా తిప్పి పంపుతున్నట్లు ఆమె నేరుగా ఓ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై రిజిస్టర్‌లో అధికారులు పరిశీలించి షణ్ముగంను మందలించారు. రెండు నెలల క్రితం సూపర్‌వైజరు షణ్ముగం ఓ మహిళా సెక్యూరిటీ గార్డును విధుల్లో ఉండగా అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు వచ్చింది. కొద్దిరోజుల పాటు అతడిని విధుల నుంచి తొలగించినప్పటికీ.. మళ్లీ చేరాడు. కాగా, విధుల్లో ఉండగా వీడియోలు తీస్తూ వేధిస్తున్నారని కొందరు మహిళా సెక్యూరిటీ గార్డులు సోమవారం మళ్లీ ఫిర్యాదు చేశారు. దీంతో షణ్ముగం వ్యవహారంపై విచారించి చర్యలు తీసుకుంటామని ఈవో వెల్లడించారు.

విద్యుత్ శాఖ ప్రతిపాదనలపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

తిరుపతి(ఆటోనగర్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, విద్యుత్ రిటైల్ ధరలపై ఏఆర్ఆర్, సప్లయ్ టారిఫ్ ప్రతిపాదనలపై మంగళ, బుధ, శుక్రవారాల్లో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రారంభమవుతుందని తిరుపతి జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్ఈ పి.సురేంద్ర నాయుడు తెలిపారు. ఎస్ఈ కార్యాలయంలో తిరుపతి టౌన్, తిరుపతి రూరల్ డివిజన్ల ప్రజలు పాల్గొంటారని పేర్కొన్నారు. పుత్తూరు, నాయుడుపేట, గూడూరు డివిజన్ కేంద్రాల్లో వినియోగదారులు పాల్గొని అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలపాలని కోరారు. పాల్గొనదలచిన వారు మంగళ, బుధవారాల్లో కూడా పేర్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. అయితే నియంత్రణా మండలి చైర్మన్ అనుమతితో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, సోమవారం ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించిన మాక్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఈలు వాసురెడ్డి, చంద్రశేఖరరావు, వాసవీలత పాల్గొన్నారు.

నేడు యూజీసీ కమిటీ రాక

ఎస్వీయూ దూరవిద్య నిర్వహణపై మూడు రోజుల పాటు అధ్యయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచీ ఎస్వీయూలో యూజీసీ కమిటీ పర్యటించనుంది. వర్సిటీ దూరవిద్య విభాగ నిర్వహణపై మూడు రోజుల పాటు ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. నలుగురితో కూడిన ఈ కమిటీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు సెనెట్ హాల్లో అధికారులు, అధ్యాపకులతో కమిటీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. అనంతరం దూరవిద్య కోర్సులు గల సబ్జెక్టులు గల విభాగాలను కమిటీ పరిశీలించనుంది. విద్యార్థులతోనూ కమిటీ ముచ్చటించనుంది.

దామినేడులో దొంగల హల్‌చల్

● ఇంటి తలుపులు పగులగొట్టిన వైనం

తిరుచానూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా దామినేడులో మరో చోరీ జరిగింది. బాధితుని కథనం మేరకు కథనం దామినేడులో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. వ్యాపారరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లొస్తుంటారు. రెండు రోజుల క్రితం వెంకటేశ్వరరావు ఇంటిలో ఆయన సోదరి కుటుంబ సభ్యులు బస చేసి వెళ్లారు. సోమవారం ఉదయం పనిమనిషి ఇంటిని శుభ్రం చేయడానికి రాగా, ప్రధాన తలుపు తెరచి ఉంది. అనుమానించి ఇంటి యజమాని వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసింది. ఆయన సూచనతో ఆమె తిరుచానూరు పోలీసులకు విషయం తెలియసేసింది. దుండగులు ఆదివారం రాత్రి ప్రధాన గేటు తాళాలు విరగొట్టారు. ప్రధాన ద్వారం ఆటోమేటిక్ లాక్ రాకపోవడంతో తలుపు విరగొట్టి లోపలకు వెళ్లారు. సీసీ కెమెరాను పగులగొట్టారు. వెంకటేశ్వరరావు సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ఆయన వచ్చి చూస్తే చోరీ సొత్తు వివరాలు తెలుస్తాయి.



చిందరవందరగా వస్తువులు

రెవెన్యూ సదస్సులకు 186 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించిన 31 రెవెన్యూ సదస్సులకు 186అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 16,097 అర్జీలు రాగా అందులో 709 పరిష్కరించామన్నారు. మిగిలిన వాటిని నిర్ణీత కాలపరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారన్నారు.

రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు

● ఛిద్రమౌతున్న కొండగుట్ట





గ్రావెల్ తవ్వకాల వద్ద అరిమేనిపాడు గ్రామస్తుల నిరసన - గ్రావెల్ తవ్వకంతో ఏర్పడిన భారీ గోతులు

ఓజిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో ఆరిమేనిపాడు నుంచి రాత్రి వేళల్లో గ్రావెల్ తరలింపు యథేచ్ఛగా సాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సోమవారం గ్రామానికి చెందిన ముప్పాళ్ళ నరేష్‌రాజు, గుంటమడుగు రవీంద్రరాజు, మస్తాన్‌రాజు కట్టిబోయిన వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున్‌రాజు, పట్టాభిరాజు, ఈశ్వరరాజు తదితరులు గ్రావెల్ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతుల వద్ద నిలబడి నిరసన తెలిపారు. వారి కథనం మేరకు వివరాలు... ఆరిమేనిపాడు సర్వే నెంబరు 65లో 260.72 ఎకరాలు కొండగుట్టగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఇక్కడ నుంచి గ్రావెల్ తరలింపు కోసం 54 ఎకరాల లీజు కోసం ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ సంస్థ 15 జూన్ 2020న దరఖాస్తు చేసుకుంది. పర్యావరణ ప్రజా విచారణ పేరుతో 2022 అక్టోబరు 28న ఆరిమేనిపాడు గ్రామంలో అధికారులు సమావేశం నిర్వహించారు. గ్రామస్తులందరూ క్వారీ అనుమతులకు అభ్యంతరం తెలిపారు. కొన్నాళ్ల తరువాత గ్రామస్తుల కంటపడకుండా రాత్రుళ్లలో గ్రావెల్ తరలింపు జరుగుతుండడంతో ఆరిమేనిపాడు వాసులంతా ఏకమై అడ్డుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక గత రెండు నెలలుగా క్వారీకి పూర్తి స్థాయి అనుమతులు ఉన్నాయంటూ గ్రావెల్ తరలింపునకు పూనుకున్నారు. గ్రామస్తులంతా ఏకమై అడ్డుకోవడంతో క్వారీ నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించి కేసులు పెట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికారులను సంప్రదించి క్వారీ అనుమతులకు సంబంధించిన వివరాలు సేకరించగా భోగస్ పత్రాలతో 2022లో క్వారీ నిర్వాహణకు అనుమతి పొందినట్లు తేలిందన్నారు. క్వారీ అనుమతులకు తమ అభ్యంతరం లేదని కాంద్ర (చిల్లకూరు మండలం), వెందోడు (బాలాయపల్లి మండలం)గ్రామాల వారితో పాటు ఆరిమేనిపాడుకు చెందిన కొంతమంది అర్జీ ఇచ్చినట్లుగా పేర్కొన్నారని, ఇందుకోసం తమ గ్రామస్తుల సంతకాలను ఫోర్జరీ చేశారని ఆరిమేనిపాడువాసులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా గ్రామంలో లేని వ్యక్తుల పేర్లు కూడా ఉన్నాయని తెలిపారు. ఆ భోగస్ పత్రాలతో ఇచ్చిన అనుమతి కూడా 2024సెప్టెంబరుతో ముగిసిందన్నారు. పక్క మండలాల్లోని గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, అక్కడి స్థానికులు సమ్మతించినట్లు చూపే పత్రాలతో తమ గ్రామంలో క్వారీ నిర్వహణకు ఎలా అనుమితి ఇస్తారని ఆరిమేనిపాడువాసులు ప్రశ్నిస్తున్నారు. పైగా గతేడాది సెప్టెంబరుతో ముగిసిన అనుమతి పత్రాలతో రాత్రి వేళ గ్రావెల్ తరలించడం అక్రమమేనని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

తిరుమలలో నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, జనవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలు జరగనున్న క్రమంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) చేపట్టనున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధిని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆనందనిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయంలోపల ఉన్న ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను శుభ్రంగా కడుగుతారు. తర్వాత సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయమంతా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.



సురేఖవాణి, సుప్రిత

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సినీనటి సురేఖవాణి, ఆమె కుమార్తె సుప్రిత, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ ఉన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 69 వినతులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 69 వినతులు వచ్చాయి. ఎస్పీ సుబ్బరాయుడు అర్జీదారుల సమస్యలు తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని పరిశీలించి, ఆయా స్టేషన్లకు పంపారు. నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణం పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

సమస్యలను పట్టించుకోండి మహాప్రభో..!



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు

కలెక్టరేట్‌కు క్యూకట్టిన అర్జీదారులు - పీజీఆర్ఎస్‌కు 214 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్),జనవరి 6(ఆంధ్రజ్యోతి): 'మా సమస్యలను పరిష్కరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులకు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎ"ఎ)కు అర్జీదారులు పెద్దయెత్తున హాజరై కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులకు తమ సమస్యలను విన్నవించారు. మొత్తం 214 అర్జీలు అందగా అందులో రెవెన్యూ శాఖకు 148 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గెరికినెట్టు గ్రామస్తులు

గ్రామానికి దారి చూపండి

తమ గ్రామానికి దారి చూపాలని పాకాల మండలం గెరికినెట్టు వాసులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. దారి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. గానుగపెంట-మొగరాల రోడ్డు నుంచి తమ గ్రామానికి వచ్చే దారిని కొంతమంది అక్రమంగా మూసేశారని తెలిపారు. ఆ దారిలో నడవకూడదని దౌర్జన్యం చేస్తున్నట్లు చెప్పారు. రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని, ఎవరైనా చనిపోతే శవాన్ని తీసుకెళ్లాలన్నా దారి లేదని వాపోయారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగరాజమ్మ డిమాండ్ చేశారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ గౌరవాధ్యక్షుడు శివకుమార్, సుశీల, నాగమణి, సుబ్రహ్మణ్యం, మంగమ్మ పాల్గొన్నారు.

పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి

అయ్యా..నేను పుట్టుకతో దివ్యాంగురాలిని. 2014లో ఎన్టీఆర్ భరోసా పింఛను వచ్చేది. జగన్ ప్రభుత్వం రాగానే రద్దు చేశారు. ఐదేళ్లుగా పింఛను కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఒక్క అధికారి కూడా సమాధానం చెప్పడం లేదు. మీరైనా స్పందించి పింఛన్ ఇచ్చేటట్టు చూడండి.

- సులోచనమ్మ, గోవర్ధనపురం, వరదయ్యపాళెం మండలం



సదరం సర్టిఫికెట్ ఉన్నా పింఛను ఇవ్వడంలేదు

అయ్యా.. అనారోగ్యం కారణంగా కుడికాలు పూర్తిగా తొలగించారు. జీవనోపాధిలేక ఇబ్బంది పడుతున్నా. సదరం సర్టిఫికెటు ఇచ్చినా కూడా అధికారులు పింఛను మంజూరు చేయడం లేదు. మీరైనా న్యాయం చేయండి.

- విష్ణు, అడవి కొడియం బేడు, పిచ్చాటూరు మండలం



గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సులభతర రీతిలో బోధించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వాధ్వాని ఫౌండేషన్ శిక్షకురాలు స్వాతిపుత్రన్

గూడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులకు అధ్యాపకులు సులభతర రీతిలో విద్యాబోధనను అందించాలని వాధ్వాని ఫౌండేషన్ శిక్షకురాలు స్వాతిపుత్రన్ అన్నారు. సోమవారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో వాధ్వాని ఫౌండేషన్, కౌన్సిల్ ఫర్ స్కిల్, కాంపిటెన్సీస్ ఆధ్వర్యంలో అధ్యాపకులకు బోధనా విధానాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆయా విభాగాల్లోని అధ్యాపకులు విద్యార్థులకు సులభతరంగా బోధనను అందించడం జరుగుతుందన్నారు. కొత్తవిషయాలను తెలుసుకుని విద్యార్థులను సాంకేతిక రంగంలో రాణించేలా కృషి చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుమాధవ్, రామ్మోహన్‌రావు, రాజయ్య, ధనుంజయ, ఇమ్మానియేలు, రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయండి



ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

గూడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేసేలా ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపిందన్నారు. జిల్లా కేంద్రమైన తిరుపతికి వెళ్లాలంటే దూరం కావడంతో ప్రజలు, ఉద్యోగులు వ్యయ ప్రయాసలు పడాల్సివస్తుందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పటికే ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలేషా, భాస్కర్‌గౌడ్, బిల్లు చెంచురామయ్య, పెంచలయ్య, ప్రభాకర్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, విద్యాకమిటీ సభ్యులు

చిల్లకూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ అన్నారు. సోమవారం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వెలగపూడి ప్రదీప్‌కుమార్ సహకారంతో తెలుగు, ఇంగ్లీష్ స్టడీమెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ షకీలా, ఉపాధ్యాయులు చంద్ర, చంద్రశేఖర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, నాగభూషణమ్మ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ఓజిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓజిలి - గొల్లపల్లి రోడ్డు మరమ్మతులు పనులను నాయుడుపేట ఆర్‌అండ్‌బీ డీఈ పరమేశ్వరి సోమవారం పరిశీలించారు. ఓజిలి మండలం చిల్లమానుచేను వద్ద గురుకుల పాఠశాల సమీపం నుంచి 2.6 కిలో మీటర మేరకు ప్యాచ్ వర్క్ కింద రూ.40 లక్షలతో మరమ్మతులు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా పర్యవేక్షించాలని ఏఈ చెన్నరాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టరు రమణను డీఈ ఆదేశించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గూడూరు అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎంపీడీవో మధుసూదన్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవప్రసన్నకుమార్, తనూజ్‌కుమార్, శీలత తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి

వాకాడు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ప్రజా సమస్యలపై స్పందిస్తూ వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఆవరణంలో సోమవారం ఆయనను సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో యడగాటిపల్లి మధుసూదన్‌రెడ్డి, బాబురెడ్డి, రౌతు రామకృష్ణ, చిట్టేటి కృష్ణారెడ్డి, జనార్దనరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, వాకాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ చోరీ

నాయుడుపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాపూజీ కాలనీలో నివాసం ఉంటున్న షబ్బీర్ తన మోటారు సైకిల్ చోరీకి గురైనట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహిళ అదృశ్యం

నాయుడుపేట టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొగగొట్టం కాలనీలో నివాసం ఉంటున్న పద్మ అనే మహిళ అదృశ్యం అయినట్లు ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి పట్టణంలోకి వెళ్లిన పద్మ తిరిగి రాకపోవడంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు సూళ్లూరుపేటలో కలెక్టర్ పర్యటన

దొరవారిసత్రం-తడ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా ఈ నెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్న నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర మంగళ వారం పర్యటిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని పరిశీలిస్తారు. పక్షుల విడిది ప్రధాన కేంద్రమైన నేలపట్టుకు మూడు రోజుల్లో విచ్చేసే సందర్శకులకు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిసారు. అలాగే పులికాట్ సరస్సులోని అటకానితిప్ప, తడ మండలంలోని బీవీ పాళెం బోటు షికారు ప్రాంతం, అక్కడి టూజం భవనాలను పరిశీలిస్తారు. అలాగే ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రధాన వేదిక అయిన సూళ్లూరుపేట జూనియర్ కాలేజీ ప్రాంగణాన్ని పరిశీలిస్తారు. అనంతరం సూళ్లూరుపేటలో అన్నిశాఖల అధికారులతో పక్షుల పండుగపై కలెక్టర్ సమీక్ష నిర్వహించనున్నారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

తడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని చేనిగుంట గ్రామానికి చెందిన కొమ్మల రవి శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీగా పనిచేస్తుంటాడు. ఆదివారం రాత్రి అతను విధులకు హాజరుకాగా కుటుంబసభ్యులు ఇంటికి తాళాలు వేసుకొని బయట ఊరికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉండటంతో పాటు అందులోని 2 సవర్ల బంగారు నగలు కన్పించకపోయేసరికి చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దెల భారం ఎన్నాళ్లు?

- వైసీపీ హయాంలో టిడ్కో ఇళ్ల కేటాయింపునకు ఎగనామం
- కూటమి ప్రభుత్వం రావడంతో లబ్ధిదారుల్లో చిగురించిన ఆశలు



మన్నారుపోలూరులో నిర్మాణం పూర్తి చేసుకొన్న టిడ్కో ఇళ్లు

సూళ్లూరుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారాన్ని వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం చేయడంతో నేటికీ టిడ్కో ఇళ్ల కేటాయింపు జరగలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు పీఎంఏవై - ఎన్టీఆర్ నగర పథకం కింద మన్నారు పోలూరు సమీపంలో సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి రోడ్డును ఆనుకొని టిడ్కో ఇళ్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2018 చివరిలో ఆన్‌లైన్ విధానంలో లాటరీ పద్ధతిలో టిడ్కో ఇళ్లను కేటాయింపులకు అధికారులు సిద్ధమయ్యారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ టిడ్కో ఇళ్ల పంపిణీని జాప్యం చేయడంతో పాటు కేటాయింపులను రద్దు చేసింది. అప్పటినుంచి ఇళ్లను తీసుకొన్న లబ్ధిదా రులకు కేటాంపు ప్రక్రియను వాయిదాలు వేస్తూ వచ్చింది. 2023 సంక్రాంతికి టిడ్కో ఇళ్లకు పాలు పొంగించి ఇస్తామని ఆర్భాటంగా చెప్పింది. అనంతరం ఉగాది అంటూ మరోసారి వాయిదా పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్ల పంపిణీపై దృష్టి సారించింది. సంక్రాంతి తరువాత లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పించి ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. సూళ్లూరుపేటలో పీఎంఏవై - ఎన్టీఆర్ నగర పథకం కింద దాదాపు 1632 ఇళ్లు మంజూరయ్యాయి. జీ-3 ఆకృతితో 31 విభాగాల్లో 32 చొప్పున 932 ఇళ్లు నిర్మించారు. 500 చదరపు అడుగుల్లో బెడ్‌రూమ్, హాలు, వంటగది, అటాచ్డ్ బాత్‌రూమ్ అదనంగా నిర్మితమైన ఫ్లాట్లకు లబ్ధిదారులు తమవంతు వాటాను డీడీల రూపం లో ఎప్పుడో చెల్లించారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు వారి నిరీక్షణకు మోక్షం లభించడం లేదు. 90 శాతం పైబడి ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా కేటాయించలేదు. కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్లపై ప్రత్యేక దృష్టిసారించి పూర్తయిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పించి త్వరితగతిన పూర్తి చేసి అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది.

అప్పులు చేసి వాటాను చెల్లించి..

మరోవైపు టిడ్కో ఇళ్ల ఆశలు పెట్టుకొని అప్పుచేసి మరీ వాటాను చెల్లించిన లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. సొంతింటి కల నెరవేరుతుందన్న ఆనందంతో అప్పోసొప్పో చేసి వాటాను చెల్లించిన ప్రజలు వడ్డీలు కట్టుకోలేక, అద్దె ఇళ్లకు బాడుగలు చెల్లంచలేక అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా సూళ్లూరుపేట మున్సిపాలిటీగా మారడం, ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు జిల్లాల పునర్విభజనతో రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయ డంతో అద్దెలు అమాంతంగా పెరిగిపోయాయి. కేవలం రెండు గదులున్న ఇంటికి నెలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల దాకా చెల్లించాల్సి వస్తోంది. కరెంట్ ఇతరత్రా ఖర్చులు సైతం ప్రజలకు భారంగా మారింది. చివరికి శివారు కాలనీల్లోనూ సైతం అద్దెల మోత మోగుతుండ టంతో అప్పుచేసి మరీ బతుకులు నెట్టుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఇళ్లను త్వరితగతిన కేటాయించాలని సూళ్లూరుపేట ప్రజలు కోరుకొంటున్నారు.

ఆర్డీవో కార్యాలయం వద్ద ఆకతాయిల బెడద

సీసీ కెమెరాల ధ్వంసం, పక్కనే ఉన్న బంకులో చోరీ



ఆర్డీవో కార్యాలయ సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన ఆకతాయిలు - ఆటో అద్దాలను పగలగొట్టిన దృశ్యం

సూళ్లూరుపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద రాత్రి వేళల్లో ఆకతాయిల బెడద ఎక్కువైంది. శ్రీహరికోటకు వెళ్లే ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న రైతు సహకార సేవా సంఘం భవనం మిద్దె పైన ఆర్డీవో కార్యాలయంఏర్పాటు చేశారు. రాత్రి అయితే కొందరు యువకులు అక్కడకు వచ్చి మద్యం సేవించి బాటిళ్లను సైతం అక్కడే పడేసి వెళ్తున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని యువకులు ఆర్డీవో కార్యాలయం బటయ ఏర్పాటు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. పక్కనే చిన్నబంకులో చోరీకి పాల్పడ్డారు. కూల్‌డ్రింగ్స్ బాటిళ్లు, తినుబండరాల ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. బంకు పక్కనే ఉన్న ఆటో అద్దాలను ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం కార్యాలయ సిబ్బంది గమనించి ఆర్డీవో కిరణ్మయికి సమాచారం అందించారు. పక్కనే ఉన్న మరో సీసీ కెమెరా పుటేజ్ ద్వారా ఆకతాయిలాలను గుర్తించేందుకు ప్రయత్నించగా శనివారం సాయంత్రం నుంచి సీసీ కెమెరాకు విద్యుత్ సరఫరా ఆపివేసి ఉండడంతో రికార్డు కాలేదు. రైతు సహకార సంఘం ఉన్న సీసీ పుటేజ్‌లను పరిశీలించగా ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో కొందరు యువకులు కేక్ కట్‌చేసి పార్టీ చేసుకొని మద్యం సేవిస్తూ కనిపించారు. అదేరోజు రాత్రి 12:06 గంటలకు కేక్ కట్ చేసిన పార్టీలో పాల్గొన్న ఓ యువకుడు సీసీ కెమెరా ధ్వంసమైన ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు కనిపించింది. ఇదంతా మందుబాబుల పనిగా అనుమానిస్తున్నారు. కాగా, ఆర్డీవో కార్యాలయ ప్రాంతంలో సాయంత్రం 6గంటలు దాటితే ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంది. పరిశ్రమలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలను ఆర్డీవో కార్యాలయ సమీపంలో బ్రిడ్జి పక్కనే పార్కింగ్ చేస్తుంటారు. ఆ వాహనాల పక్కనే ఆకతాయిలు మద్యం తాగుతూ ఉండడంతో ఉద్యోగులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో ఆర్డీవో కార్యాలయ ప్రాంతంలో గస్తీ పెంచాల్సిన అవసరం ఉంది.

వైసీపీ నేతల కబ్జా భూములను బయటకు తీస్తాం: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్

కోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న ఐదేళ్ల వైసీపీ నాయకులు కేశవరం పంచాయతీలో 341 ఎకరాల పేదల భూములను కబ్జా చేశారని, ఆ భూములన్నీ బయటకుతీసి పేదలకు అప్పజెప్పుతామని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కేశవరంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో పాటు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా విచ్చేసి రైతులు, స్థానికుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేశవరం పంచాయతీలో కొంతమంది వైసీపీ నాయకులు దళిత, గిరిజనుల భూములను వాళ్లకు తెలియకుండానే కబ్జాచేసి బ్యాంకుల్లో తాకట్టుపెట్టి రుణాలు పొందారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తాను పేదల ఓట్లతో గెలిచానని, పెద్దోళ్లు బెదిరించినా జంకే ప్రసక్తే లేదన్నారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంకా ఏవైనా భూసమస్యలు ఉంటే సంబంధిత తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, బీసీసెల్ అధ్యక్షుడు చాపల శ్రీనివాసులు, కోటేశ్వరప్రసాద్, నాగూరయ్య, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, మధు యాదవ్, వేణు, వెంకటేశ్వర్లు, భూపతి, బాబు, తహసీల్దారు జయ జయరావు, ఆర్‌ఐ మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వోలు పోలయ్య, మోసీన్, ఏడుకొండలు, శ్రీనివాసులు, అల్లాభక్షులు పాల్గొన్నారు.



షటిల్ బ్యాడ్మింటిన్‌లో ప్రథమ స్థానం పొందిన దొరవారిసత్రం, కబడ్డీలో ప్రథమ స్థానంలో నిలిచి కోట విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న డిప్యూటీ సెక్రటరీ మాధవయ్య, ప్రిన్సిపల్ తిరుపతయ్య

ముగిసిన గురుకులాల క్రీడా పోటీలు

దొరవారిసత్రం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బీసీ గురుకులాల క్రీడా పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. జోన్-3 పరిధిలో 10 పాఠశాలలకు సంబంధించిన దొరవారిసత్రం బీసీ గురుకుల పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన క్రీడా పోటీల్లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ఎర్రగొండ, వినుకొండ, వేటపాళెం, వెంకటగిరి, దొరవారిసత్రం, నిజాంపట్నం, కోట, కొండపి, దాచేపల్లి గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 100 మీటర్ల రన్నింగ్‌లో వేటపాళెం విద్యార్థి ప్రవీణ్‌కుమార్ విన్నర్‌గా నిలిచాడు. నిజాంపట్నం పాఠశాల విద్యార్థి ఎం.రవీంద్రనాథ్, కోట పాఠశాల విద్యార్థి టి.తరుణ్ రన్నర్స్‌గా నిలిచారు. అలాగే 200 మీటర్ల రన్నింగ్‌లో వేటపాళెం పాఠశాల విద్యార్థి ప్రవీణ్‌కుమార్ విన్నర్, కోట పాఠశాల విద్యార్థి సాయిచరణ్, దాచేపల్లి విద్యార్థి ధర్మరాజు రన్నర్స్‌గా నిలిచారు. అదేవిధంగా 400 మీటర్ల పరుగు పందెంలో వేటపాళెం పాఠశాల విద్యార్థి కాటంరాజు విన్నర్‌గా, కోట పాఠశాల విద్యార్థులు వంశీ, సాయిచరణ్ రన్నర్స్‌గా నిలిచారు. 800 మీటర్ల రన్నింగ్‌లో వేటపాళెం విద్యార్థి బి. ప్రవీణ్ విన్నర్‌గా, కోట విద్యార్థి తరుణ్, వెంకటగిరి విద్యార్థి షేక్ అబ్దుల్ రన్నర్స్‌గా నిలిచారు. అలాగే 1500 మీటర్ల రన్నింగ్‌లో దొరవారిసత్రం పాఠశాల విద్యార్థి ఎం.సాయితేజ్ విజేతగా నిలిచారు. వేటపాళెం పాఠశాల విద్యార్థి ఎ.కాశీనాగేశ్వరరావు, వినుకొండ విద్యార్థి దొరయ్య ప్రసాద్ రన్నర్స్‌గా నిలిచారు. అలాగే షాట్‌పుట్‌లో కోట విద్యార్థి ఉమేష్, డిస్క్‌త్రోలో నిజాంపట్నం విద్యార్థి చంద్రప్రకాష్, జావలిన్ త్రో వేటాళెం విద్యార్థి ప్రవీణ్‌కుమార్, లాంగ్ జంప్‌లో కోట విద్యార్థి తరుణ్, హైజంప్‌లో కోట విద్యార్థి వంశీ విజేతలుగా నిలిచారు. అలాగే కబడ్డీలో కోట జట్టు విన్నర్‌గా, దొరవారిసత్రం జట్టు రన్నర్‌గా, ఖోఖోలా కోట జట్టు విజేత, దొరవారిసత్రం జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఇక క్యారమ్స్‌లో కోట, చెస్‌లో వేటపాళెం, బాట్మింటన్‌లో దొరవారిసత్రం, టెన్నిస్ కాయిస్‌లో దొరవారిసత్రం, హ్యాండ్‌బాల్‌లో కోట విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలతకు బీసీ గురుకుల పాఠశాలల రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ మాధవయ్య ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రిన్సిపల్ తిరుపతయ్య పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో షంషాద్ బేగం

వెంకటగిరి టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సీడీపీవో షంషాద్ బేగం ఆధ్వర్యంలో కిశోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చదువు ఆపేసిన 11-18వయస్సు బాలికలను చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్య పోషణ, బాల్యవివాహాల నివారణ, ఆత్మరక్షణ, భద్రత, మానసిక ఆరోగ్యం జీనవోపాధి అవకాశాలు, యోగా తదితర వాటిపై అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీవో కోటీశ్వరరావు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తంబిరెడ్డి తనూజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై చర్యలేవీ?

పెళ్లకూరు. జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని చిల్లకూరు సర్పంచు పగడాల హరిబాబురెడ్డి, గ్రామస్తులు సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చిల్లకూరు మండలంలోని మేత భూముల ఆక్రమణలపై రెండు నెలల కిందట గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. మేత పోరంబోకు భూముల్లో వరి సాగు చేస్తున్నారని, దాంతో గ్రామంలో పశువులను మేపుకునేందుకు స్థలం లేక ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. మేత పోరంబోకు భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటకాలువ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నాయుడుపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం పండ్లూరు వద్ద ఉన్న పంట కాలువను ఓ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆక్రమించినట్లు అదే గ్రామానికి చెందిన రైతు కస్తూరయ్య సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కలుషిత నీటిని పొలాల్లోకి వదిలేస్తున్నారని, దీనివల్ల పంటలు దెబ్బదింటున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి

చిట్టమూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలంలోని ప్రధాన రోడ్లు దుస్థితి దారుణంగా ఉంది. ప్రధానంగా మెట్టు సమీపంలోని కోట, నాయుడుపేట రోడ్లు పెద్దపెద్ద గోతులు పడి ప్రమాకరంగా ఉన్నాయి. మెట్టు గ్రామం నుంచి సుమారు రెండొందల మీటర్ల వరకు అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. గత ప్రభుత్వంలో భారీ వాహ నాలతో ఇసుక అక్రమ రవాణా జరగడం వల్లే రోడ్లు దెబ్బతిన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలివ్వండి

సూళ్లూరుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు మంజూరు చేసే ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఆర్డీవో ఈ.కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు మోదుగుల పార్థసారధి, రమణయ్య, నాగేంద్ర, శ్రీనివాసులు, కుమార్, బాబు, కృష్ణయ్య, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూముల కబ్జాపై ఫిర్యాదు

కోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కోట మండలం సిద్ధవరంలో సర్వే నెంబరు 39లోని లక్షలాది రూపాయలు విలువచేసే శ్మశాన భూములను కబ్జా చేస్తున్నారని ఆ గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాకు ఫిర్యాదు చేశారు. సిద్ధవరం గ్రామానికి చెందిన దళితులు తరతరాలుగా స్థానికంగా ఉన్న 4 ఎకరాల ప్రభుత్వ భూమిని శ్మశానంగా వాడుకుంటున్నారని, ఆ భూములను కొంత మంది కబ్జాచేసి తమ భూముల్లో కలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. స్పందించిన ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ సిద్ధవరం శ్మశాన భూములు కబ్జాకు గురికాకుండా హద్దులు నాటాలని తహసీల్దారు జయజయరావును ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వాటంబేటి చెంగల్‌రావు, ఇంగిలాల రామయ్య, కృష్ణమోహన్, నాగరాజు, పిండి వెంకటకృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

నెలవల దంపతులకు సన్మానం



నాయుడుపేట టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులను మాజీ సర్పంచు గూడూరు ప్రభావత్మ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గూడూరు సుధీర్‌రెడ్డి, తెలుగుయువత నాయకులు అవధానం సుధీర్, గోపాలకృష్ణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కీడా పరికరాల పంపిణీ

గూడూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థి గణేష్‌కు ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ గణేష్ అండర్-14 జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక కావడంతో హాకీస్టిక్, దుస్తులు, బూట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మురళీ నాయుడు, కరిముల్లా, శ్రీహరి, వెంకటేశ్వర్లు, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయంలో గ్రీవెన్స్

వెంకటగిరి టౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని 8వ వార్డు సచివాలయంలో కౌన్సిలర్ ఆరి శంకరయ్య ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వార్డు పరిధిలోని బొగ్గులమిట్ట, ధర్మాపురం, నరసింహారవు, ముత్తరాశి పాళెం ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు.



చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మాజీ ఎంపీ పనబాక లక్ష్మి